శుక్రవారం 30 అక్టోబర్ 2026 పేజీలు : 8

గంజాయి, మాదకద్రవ్య రహిత కమిషనరేట్‌గా రామగుండం

- డ్రగ్స్ సరఫరా మూలాలను సమూలంగా ఛేదించాలి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- పెడ్లర్లపై నిరంతర నిఘా.. సరఫరా నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం
- ఈగిల్ టీమ్ ఎస్పీ గిరిధర్
- గంజాయికి అలవాటుపడిన 55 మంది యువతకు కౌన్సెలింగ్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- అగ్నిమాపక, నిఘా వ్యవస్థలు పటిష్టంగా ఉండాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
- నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులు, ఔషధ దుకాణాలు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ కరువు రాష్ట్రంగా మారింది

- మాజీ మంత్రి జోగు రామన్న
- రైతు గర్జన సభాస్థలానికి డైట్ మైదానంలో భూమిపూజ

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి)కాంగ్రెస్ పాలనలో తెలంగాణ పూర్తిగా కరువు రాష్ట్రంగా మారిందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఎన్నికల ముందు తెలంగాణలో గత పరిస్థితులను మళ్లీ తీసుకొస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి రాష్ట్రాన్ని కరువు పరిస్థితుల్లోకి నెట్టారని మాజీ ఎంపీ బాల్క సుమన్

రెడ్ క్రాస్ సేవలు మరింత విస్తృత పరచాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి) జిల్లాలో ఇండియన్ రెడ్ క్రా స్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేసేందుకు చర్య లు తీసుకుంటామని, సంస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఐ ఆర్‌సీఎస్ ప్రతినిధులతో ఆ యన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ కార్యకలాపాలకు ఊతమిచ్చేలా పలు అంశాలపై కలెక్టర్ సూచ నలు చేస్తూ సంస్థ ద్వారా ప్రజలకు వైద్య సేవలు, రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిరంతరం

ఇండో శ్రీలంక మైత్రి సేతు సైకిల్ యాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 29 ,(ప్రజాజ్యోతి)ఇండో--శ్రీలంక మైత్రి సేతు అంతర్జాతీయ సైకిల్ యాత్రలో భాగంగా డిసెంబర్ 22న నిర్మల్ జిల్లాకు చేరుకోనున్న సైక్లింగ్ బృందానికి ఘన స్వాగతం పలికేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.జిల్లాకు చేరుకునే సైక్లింగ్ బృందానికి తగిన వసతి, ఆతిథ్య సౌకర్యాలు కల్పించాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. సైకిల్ యాత్ర ఆదిలాబాద్ జిల్లా వైపు వెళ్లేందుకు అనువైన రూట్ మ్యాప్‌ను రూపొందించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.ఇండో--శ్రీలంక మైత్రి సేతు సైకిల్ యాత్ర వంటి అంతర్జాతీయ కార్యక్రమాలు ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. యాత్ర విజయవంతంగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, 32వ బెటాలియన్ ఎన్‌సీసీ ప్రతినిధి సంజీవ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

అగ్నిమాపక, నిఘా వ్యవస్థలు పటిష్టంగా ఉండాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులు, ఔషధ దుకాణాలు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 29 ,(ప్రజాజ్యోతి) నిర్మల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచడంతో పాటు అగ్నిమాపక, నిఘా వ్యవస్థలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యారోగ్య శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టి, వైద్య పరికరాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరై సమయపాలన పాటించాలని, ఆసుపత్రుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.జిల్లాలోని ఆసుపత్రులు, ఔషధ దుకాణాలు, రోగ నిర్ధారణ కేంద్రాలు నిబంధనలకు అనుగుణంగా పనిచేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రోగ నిర్ధారణ పరీక్షల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేసే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించాలని, ప్రజలకు జన

ఔషధి మందులపై అవగాహన కల్పించాలని తెలిపారు. టీబీ వ్యాధి నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మెరుగైన వైద్య సలహాలు, నిరంతర పర్యవేక్షణ ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, డీసీహెచ్‌ఎస్ కాశీనాథ్, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించిన జిల్లా కలెక్టర్‌కు రైతుల కృతజ్ఞతలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 29 ,(ప్రజాజ్యోతి) నిర్మల్ జిల్లా కడెం మండలం కొత్త మద్దిపడగ సదర్‌మాట్ బ్యారేజీ చివరి ఆయకట్టు గ్రామాల రైతులు పంట పొలాలకు సాగునీరు అందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. తమ పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరి ఆయకట్టు రైతుల సమస్యలపై స్పందించి సాగునీరు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలిగా వేముల సరస్వతి

రామకృష్ణాపూర్,అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి): మంచిర్యాల జిల్లా బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలిగా వేముల సరస్వతి నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు అశోక్ దుర్గం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి ఎనగందుల, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రమేష్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని వేముల సరస్వతి తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్

ఆసిఫాబాద్, అక్టోబర్ 29 ప్రజా జ్యోతి పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ వార్డును శుభ్రంగా ఉంచుకోవాలని ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామయ్య, కాలనీవాసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించి, పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు.వార్డులో చెత్త సేకరణ, మురుగు కాలువల శుభ్రత పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ప్రజలు రోడ్లపై, మురుగు కాలువల్లో చెత్త వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వార్డును పరిశుభ్రంగా ఉంచడం మున్సిపల్ సిబ్బందితో పాటు ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపల్ సిబ్బందికి కాలనీవాసులు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నల్గొండ శ్రీరాములు, అనుమండ్ల శ్రీకాంత్, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

బోథ్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలోని ఆదర్శ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణను పాటిస్తూ కష్టపడి చదవాలని, అలాగే తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరును తీసుకురావాలని పేర్కొన్నారు. చదువుతో సమాజంలో మంచి గుర్తింపుతో పాటుగా గౌరవ మర్యాదలను పొందుతారని తెలిపారు. సృజనాత్మక ఆలోచనలతో ముందుకెళుతూ ఆదర్శ పాఠశాలను జిల్లాలోనే ఆదర్శంగా నిలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనురాధ, ఐస్ ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శోభ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

: అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

నేరడిగొండ అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): బోథ్ ఎక్స్ రోడ్డు గుండా ప్రయాణించే వేలాది మంది ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను గురువారం స్థానిక శాసనసభ్యులు అనిల్ జాదవ్ నేరుగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్మాణ పనుల వేగం, నాణ్యతపై అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు ఉండకూడదని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి, వీలైనంత త్వరలోనే ఈ మరుగుదొడ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.అలాగే, రాత్రి వేళల్లో ప్రయాణికులకు, స్థానికులకు చీకటి సమస్య లేకుండా ఇటీవల బోథ్ ఎక్స్ రోడ్డు జంక్షన్ వద్ద హైమాస్ వెలుగులను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. నియోజకవర్గంలో ప్రయాణికుల కనీస అవసరాలను తీర్చడమే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఇందులో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, ప్రీతం రెడ్డి, ఉప సర్పంచ్ గులాబ్, దేవేందర్ రెడ్డి, వెంకట్రావు, సుజీల్, గాడ్గే సుభాష్‌లతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బోథ్ పీఏసీఎస్ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ

-బీసీ, రెడ్డి సామాజికవర్గాల నుంచి ఆశావహుల పేర్లతో వేడెక్కిన రాజకీయ చర్చలు

బోథ్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి)దబోథ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవి ఎవరికి దక్కనుందనే అంశం స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. కీలకమైన ఈ పదవికి సంబంధించి వివిధ సామాజికవర్గాల నుంచి ఆశావహుల పేర్లు వినిపిస్తుండటంతో నాయకత్వ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

ఆశావహులుగా ఐదుగురు నాయకుల పేర్లు

బీసీ వర్గం నుంచి బొజ్జ సాయన్న, చట్ల ఉమేష్ పేర్లు చర్చల్లో ఉండగా, రెడ్డి సామాజికవర్గం నుంచి ఆలపాటి అచ్యుతానంద్ రెడ్డి, నల్ల శ్రీకాంత్ రెడ్డి, ఇట్టడి సత్యనారాయణ రెడ్డి పేర్లు స్థానికంగా ప్రస్తావనకు వస్తున్నాయి. దీంతో చైర్మన్ ఎంపికపై రాజకీయ వర్గాల్లో చర్చలు మరింత ఆసక్తికరంగా మారాయి.

సామాజిక సమీకరణాలపై ఆసక్తి

ఈ పదవి కేటాయింపులో సామాజిక సమీకరణాలు ఎలాంటి పాత్ర పోషిస్తాయనే అంశంపై చర్చ సాగుతోంది. అదే సమయంలో పార్టీ కోసం చేసిన సేవలు, రైతులతో ఉన్న అనుబంధం, స్థానిక కార్యకర్తల మద్దతు, సహకార రంగంపై అవగాహన వంటి అంశాలు కూడా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

తుది నిర్ణయంపై అందరి చూపు

రైతుల రుణాలు, ఎరువులు, విత్తనాల సరఫరా, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో పీఏసీఎస్ కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల ఈ పదవిని చేపట్టబోయే నాయకుడిపై రైతులు, స్థానిక రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.బీసీ వర్గం నుంచి అవకాశం దక్కుతుందా రెడ్డి సామాజికవర్గం నుంచి ఎవరైనా పీఠాన్ని అధిరోహిస్తారా ఐదుగురు ఆశావహుల్లో చివరకు ఎవరికి అవకాశం లభిస్తుంది అనేది ప్రస్తుతం బోథ్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.అయితే, చైర్మన్ పదవికి సంబంధించి తుది నిర్ణయం అధికారికంగా వెల్లడికాకపోవడంతో ప్రస్తుతానికి ఈ పేర్లన్నీ ఆశావహులుగా జరుగుతున్న చర్చల్లోనే ఉన్నాయి. నాయకత్వం తీసుకునే తుది నిర్ణయంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆదేశాలతో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ ను కలిసిన తెలంగాణ రాష్ట్ర మేదరి సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ మదిరే సత్యనారాయణ

ఖానాపూర్ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి) ఖానాపూర్ శాసనసభ్యులు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర మేదరి సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ మధిరె సత్యనారాయణ గురువారం ఎమ్మెల్సీ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హైదరాబాదులోని గాంధీభవన్లో కలిశారు రాష్ట్ర మేదర ఫైనాన్స్ కార్పొరేషన్ నామినేటెడ్ పదవి కొరకు ఎమ్మెల్యే సిఫారసుతో కలిసి టీపీసీసీ కి విన్నవించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజుర సత్యం సింగం లక్ష్మీపతి గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్లో "మీలో ఎవరు లక్షాధికారి-2" రెండవ ప్రిలిమ్స్ పరీక్షలి

విజేతకు మొదటి 1లక్ష రెండవ 50,వేలు కన్సోలేషన్ 8 మందికి 10వేల చొప్పున

ఖానాపూర్, అక్టోబర్ 29.(ప్రజా జ్యోతి)నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం "మీలో ఎవరు లక్షాధికారి-2" క్విజ్ పోటీల రెండవ ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించారు.నిర్మల్ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో, తన్నూరు వనిత - వెంకటేశ్వరరావు దాతల సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి ప్రిలిమ్స్ పరీక్షను సెప్టెంబర్ 25న నిర్వహించగా, రెండవ ప్రిలిమ్స్ పరీక్షను బుధవారం నిర్వహించారు.ఈ పరీక్షలు కేవలం 9వ తరగతి విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, గురుకుల, మోడల్ స్కూల్, కేజీబీవీ, సంక్షేమ పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చు. ప్రతీ సెక్షన్ నుండి 5 మంది విద్యార్థులు మాత్రమే పాల్గొనేలా నిబంధన విధించారు.ఈ రెండు ప్రిలిమ్స్ పరీక్షల్లో వచ్చిన మార్కుల సగటు ఆధారంగా టాప్ 50 మంది విద్యార్థులను మెయిన్స్ పరీక్షకు ఎంపిక చేస్తారు. మెయిన్స్ పరీక్షను నవంబర్ 26న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మెయిన్స్ నుండి టాప్ 10 మందిని ఎంపిక చేసి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాధికారితో ముఖాముఖి కార్యక్రమానికి పంపిస్తారు. అందులో విద్యార్థుల సంభాషణ విధానం, కలెక్టర్, డీఈవో అడిగే జీకే ప్రశ్నలకు సమాధానం ఇచ్చే తీరును పరిశీలించి మొదటి, ద్వితీయ స్థానాలను ఎంపిక చేస్తారు.మొదటి బహుమతి 1లక్ష రూపాయలు, రెండవ బహుమతి రూ. 50 వేల రూపాయలు, మిగతా 8 మందికి ఒక్కొక్కరికి 10 వేల చొప్పున బహుమతులు అందజేస్తారు. అంతేకాకుండా మెయిన్స్ పరీక్ష రాసిన 40 మంది విద్యార్థులకు కూడా ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నారు.

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ కరువు రాష్ట్రంగా మారింది

మాజీ మంత్రి జోగు రామన్న

రైతు గర్జన సభాస్థలానికి డైట్ మైదానంలో భూమిపూజ

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి)కాంగ్రెస్ పాలనలో తెలంగాణ పూర్తిగా కరువు రాష్ట్రంగా మారిందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు.ఎన్నికల ముందు తెలంగాణలో గత పరిస్థితులను మళ్లీ తీసుకొస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి రాష్ట్రాన్ని కరువు పరిస్థితుల్లోకి నెట్టారని మాజీ ఎంపీ బాల్క సుమన్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో రైతాంగం తీవ్ర ఇ బ్బందులు ఎదుర్కొంటోందని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో నవంబర్ 1న నిర్వహించనున్న రైతు గర్జన సభకు సంబంధించి గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి జోగు రామన్న నేతృత్వంలో జరుగుతున్న ఈ కార్యక్ర మానికి గ్రామీణ,పట్టణ ప్రాం తాల ప్రజలు, రైతులు, మహిళలు, యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

కేసీఆర్ పాలనలో రైతుసం క్షేమానికి ప్రాధాన్యం

బాల్కసుమన్

మాజీ ఎంపీ బాల్క సుమన్ మాట్లాడుతూ ఇంద్రవెల్లి సభ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ,రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రతిబింబి స్తున్నాయని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో కేసీఆర్ నాయక త్వంలో రైతుబంధు, రైతుబీ మా, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా తెలంగాణ అభివృద్ధికి కృషి జరిగిందన్నారు. ప్రస్తుతం రైతులు సాగునీరు, పె ట్టుబడి సాయం వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ మహారాష్ట్ర ప్రభుత్వంతో నీటి వనరుల అంశాలపై చర్చలు జరిపారని గుర్తుచేస్తూ, రైతుల సమస్యల పరిష్కారంపై ప్రస్తుత ప్రభుత్వం చూపుతు న్న చొరవ ఏమిటని ప్రశ్నిం చారు. కృష్ణా, గోదావరి జలా ల వినియోగం, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ ప్రయో జనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతాంగం నష్ట పోతోందని విమర్శించారు. రైతులకు అండగా నిలిచి వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకే రైతు గర్జన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రైతు గర్జనతో ప్రభుత్వానికి హెచ్చరిక పంపాలి

ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్ర భుత్వ పాలనలో రైతులు, ప్రజలు అనేక సమస్యలు ఎ దుర్కొంటున్నారని విమర్శించారు. రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళ న వ్యక్తం చేస్తూ, రైతుబంధు, రైతుబీమా వంటి పథ కాల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా ను గులాబీమయం చేసేలా రైతు గర్జన సభకు ప్రజలు భారీగా తరలిరా వాలని పిలుపు నిచ్చారు. రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీ సేందుకు ఈ సభ వేదిక కా వాలని అన్నారు.

తెలంగాణకు కేసీఆర్ పాల నే శ్రీరామరక్ష

భార్గవ్ దేశ్ పాండే

యువ నాయకుడు భార్గవ్ దేశ్ పాండే మాట్లాడుతూ తెలంగాణ సంక్షేమం, అభివృద్ధికి కేసీఆర్ పాలనలో అమలైన పథకాలు దోహదపడ్డాయని అన్నారు. రైతులు, పేదలు, వివిధ వర్గాల ప్రజల కు అండగా నిలిచే విధానాలు కొనసాగాలని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై ప్రజలు తమ సమ స్యలను బలంగా వినిపించా లని,రైతు గర్జన సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలు పునిచ్చారు

రైతాంగానికి భరోసా కల్పిం చడమే రైతు గర్జన లక్ష్యం

జోగు రామన్న

మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ గత బీ ఆర్ఎ స్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రైతుబంధు, రైతు బీమా పథకాలను అమలు చేశామని తెలిపారు. సాగు నీటి ప్రాజెక్టులు, పంప్‌హౌస్‌ల నిర్మాణం ద్వారా వ్యవసా యానికి నీరందించే ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్ర భుత్వ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల ను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రైతు బంధు, రైతుబీమా పథకాలతో పాటు కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. రైతులకు భరోసా కల్పిస్తూ వారి సమస్యలపై పోరాటాన్ని కొనసా గిస్తామని స్పష్టం చేశారు. నవంబర్ 1న సాయంత్రం 5 గంటలకు ఆదిలాబాద్ డైట్ మైదానంలో నిర్వహించను న్న రైతు గర్జన సభకు రైతులు, ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చే యాలని కోరారు.ఈ కార్యక్రమంలో జోగు మహేందర్, పట్టణ అధ్యక్షుడు అజయ్, ఫ్లోర్ లీడర్ వేణుగంటి ప్రకా ష్, ఆత్రం వెంకటేష్, సలీం, అనిల్, అన్నెల వాసంత్, పండ్లశ్రీను, కేమ శ్రీకాంత్, తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కరవు సాయంపైనే రైతుల ఆశలు

ఉమ్మడి జిల్లాలో 45 మండలాలు కరవు ప్రాంతాలుగా గుర్తింపు

తీవ్ర ప్రభావిత మండలాలుగా 11 ఖరారు

తాగునీటి ఎద్దడి, ఇన్పుట్ సబ్సిడీ, రుణాల పునర్ వ్యవస్థీకరణపై స్పెషల్ ఫోకస్

సహాయకచర్యలకు అధికార యంత్రాంగం కసరత్తు

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి) ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, తగ్గిన పంటల దిగుబడి, రైతులను సంక్షో భంలోకి నెట్టేసింది. సాధారణ వర్షపాతానికంటే ఈసారి తక్కువ వర్షాలు కురియడం వల్ల జలాశయాల్లో నీరు చేర క పంటల సాగు ఉమ్మడి జిల్లాలో చతికిల పడింది. వర్షాధారంపైనే ఆశలు పెట్టు కుని 80 శాతం పంటలు సాగు చేసిన రైతులకు పంట పెట్టుబడి ఖర్చులు కూడ అందే పరిస్థితి లేక కరవు దుర్భిక్షం వెంటాడుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాల వారీగా పంటల సాగు విస్తీర్ణం, తగ్గిన దిగుబడులు, జలాశయాల్లో అడుగంటిన నీటి నిలువలు, భూగర్భజ లాల నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం 365 మండలాల ను కరవు ప్రాంతాలుగా గుర్తించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 45 మండలాలను కరవు ప్రాంతాలుగా ఖరారు చేసింది. వీటిలో 11 మండలాల్లో అత్యంత లోటు వర్షపాతం నమోదుకావ దంతో తీవ్ర ప్రభావిత మండలాలుగా గుర్తించి యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టనుంది. ఎల్ నినోప్రభావం, వర్షాభావ పరిస్థితులు, తగ్గిన పంటల దిగుబడి రైతులను సంక్షోభంలో నెట్టే సింది. సాధారణ వర్షాపాతానికంటే ఈ సారి తక్కువవ ర్షాలు కురియడంతో జలాశయాల్లో నీరు చేరక పంటల సాగు ఉమ్మడిజిల్లాలో చతికిల పడింది.వర్షాధారంపైనే ఆశలు పెట్టుకుని 80 శాతం పంటలు సాగుచేసిన రైతులకు పంట పెట్టుబడి ఖర్చులు కూడ అందే పరిస్థితి లేక కరవు దుర్భిక్షం వెంటాడు తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాల వారిగా పంటల సాగువిస్తీర్ణం తగ్గిన దిగుబడులు, జలాశయాల్లో అడుగంటిన నీటి నిలువలు, భూగర్భజలాల నివేదిక ఆధారంగా రాష్ట్రప్రభుత్వం 365 మండలాలను కరవు ప్రాంతాలు గా గుర్తించగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 45 మండలాలను కరవు ప్రాంతాలుగా ఖరారు చేసింది. వీటిలో 11 మండలాల్లో అత్యంత లోటు వర్షాపాతం నమోదుకావడంతో తీవ్ర ప్రభావిత మండలాలుగా గు ర్తించి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్ట నుంది.

జిల్లాల వారిగా కరవు మం డలాలు ఇవే

ఆదిలాబాద్ జిల్లాలో 20 మండలాలు కరవు ప్రాంతా లుగా గుర్తించగా తల మడుగు మండలం మినహా భీం పూర్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్ అర్బన్, సిరికొండ, గాది గూడ, గుడిహత్నూర్, నా ర్నూర్ ఆదిలాబాద్ రూరల్, మావల, తాంసి, బజార్ హ త్నూర్, బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, ఉట్నూర్ సొనాల జైనథ్, బేల, సాత్నాల, బోర జ్ మండలాలను కరవు మండలాలుగా ప్రభుత్వం ఖ రారు చేసింది. ఇక కొమరం భీం జిల్లాలోని ఐదు మండ లాలు అయిన జైనూర్, సి ర్పూరు, చింతల మానెపల్లి, బెజ్జూర్, కౌటాల మండలాలు కరవు ప్రాంతాలుగా గుర్తించారు. మంచిర్యాల జిల్లాలోని 11 కరవు మండలాలుగా ఖరారు కాగా వీటిలో జన్నారం, వేమనపల్లి, హాజీ పూర్, నెన్నెల, మందమర్రి, మంచిర్యాల, నస్పూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాలను ప్రభుత్వం గుర్తించింది. ఇక నిర్మల్ ల్లాలో 9 మండలాలు కరవు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఖానాపూర్, కుభీర్, బైంసా, కుంటాల, నిర్మల్, సోన్, లక్ష్మణ చాందా, కడెం, దస్తురాబాద్ మండలాలు కరవు ప్రభావిత ప్రాంతాల్లో చేర్చా రు.

తక్షణ సహాయ చర్యలకు సర్కారు కసరత్తు

కరవు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయ చర్యలు చే పట్టాలని ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ మేరకు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో కలెక్టర్లు కార్యాచరణ రూపొందించి ప్రభుత్వం నిర్దేశించిన సహాయ చర్యలపై దృష్టిసారించారు. వ్యవసాయరుణాల పునర్ వ్యవస్థీకరణ, బల వంతపు రుణ వసూళ్ల ని లిపివేయడం, ఇన్పుట్ సబ్సిడి పెంచడం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించడం, పశుగ్రాసం అందు బాటులోఉంచడం లాంటి కీలక బాధ్యతలపై ప్రభుత్వం దృష్టిసారించ నుంది. శాస్త్రీ య నివేదికల ఆధారంగా ఉమ్మడి జిల్లాలో 45 మండ లాల్లో కరవుప్రాంతాలను ప్రభుత్వం గుర్తించడంతో రై తుల్లో ఊరట కలిగిస్తుంది.ముఖ్యంగా ప్రభుత్వం ఉత్త ర్వులు జారీచేయడంతో రా బోయే ఆరు నెలల పాటు కరవు జాబితా ఆధారంగా సహాయ కార్యక్రమాలు కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. సహాయక చర్యలపై రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కంప్యూటర్, ఇంటర్నెట్, మొబైల్ ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు అవసరం

శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

మంచిర్యాల, 29, అక్టోబర్ (ప్రజాజ్యోతి): రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ సూచించారు. కంప్యూటర్, ఇంటర్నెట్ సేవలు, మొబైల్ ఫోన్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. సైబర్ నేరాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం ఏరియాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అధికారులు, ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల కోసం నిర్వహించిన 37వ సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమంను గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ సైబర్ నేరాల తీరు, నేరగాళ్లు అనుసరిస్తున్న వ్యూహాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల కారణంగా ఆర్థికంగా, సామాజికంగా నష్టపోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా ఈ-మెయిల్స్, ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఇంటర్నెట్ సేవలు వినియోగించేటప్పుడు, ఫైల్స్ డౌన్‌లోడ్ చేసేటప్పుడు గుర్తుతెలియని లింకులను ఇష్టానుసారంగా ఓపెన్ చేయకూడదని, నమ్మకమైన బ్రౌజర్లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఈ-మెయిల్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌తో పాటు ఇతర డిజిటల్ సేవలకు సంబంధించిన పాస్‌వర్డ్‌లను పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్‌లో ఉపయోగించే యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం ద్వారా సైబర్ ముప్పులను తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, పాస్‌వర్డ్‌ల విషయంలో అత్యంత గోప్యత పాటించాలని, వ్యక్తిగత పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు తెలియనివ్వకూడదని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్‌లోని వివిధ యాప్‌లకు అనుమతులు ఇచ్చే విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సింగరేణి సంస్థకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని సురక్షితంగా ఉంచడంతో పాటు, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఆన్‌లైన్ సేవలు దుర్వినియోగం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సైబర్ భద్రత అంశంపై 20 మార్కులకు నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం కృష్ణప్రసాద్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ కార్మిక సభ్యత్వ నమోదు తప్పనిసరిగా చేపట్టాలి

కార్మిక సంఘాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి..

శ్రీరాంపూ ఏరియాలో కేంద్ర కమిటీ నాయకుల సమావేశం

మంచిర్యాల, 29, అక్టోబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సహా కార్మికులందరినీ సంఘ సభ్యత్వ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఐఎన్‌టీయూసీ కార్మిక సభ్యత్వ నమోదు ప్రక్రియను తప్పనిసరిగా చేపట్టాలని కేంద్ర కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో ప్రతిపాదించారు. కార్మికుల ఐక్యతే సంఘానికి బలమని, సభ్యత్వమే సంఘటిత పోరాటానికి పునాది అని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు . ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో కేంద్ర కమిటీ ముఖ్య నాయకుల అత్యవసర సమావేశంను నిర్వహించారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్లు ల్యాగల శ్రీనివాస్, శీలం చిన్నయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు పి. ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్లు భీంరావు, తిరుపతి రాజు, కలవెన శ్యామ్, జనరల్ సెక్రటరీలు డాక్టర్ ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గరిగ స్వామి, సెంట్రల్ సెక్రటరీలు పిన్నింటి మల్లారెడ్డి, కాకూరి మనోజ్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సభ్యత్వ నమోదు అంశంపై నాయకులు విస్తృతంగా చర్చించారు. సంఘాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు కార్మికుల హక్కుల పరిరక్షణలో ఐఎన్‌టీయూసీ పాత్రను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వారు వివరించారు. సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సహా అన్ని విభాగాలకు చెందిన కార్మికులను సంఘటితం చేయడం ద్వారా వారి సమస్యలను ఉన్నతస్థాయి నాయకత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, వైద్య సదుపాయాలు, ఇతర సంక్షేమ అంశాలపై పోరాటాలను మరింత బలోపేతం చేయడంలో సభ్యత్వ నమోదు కీలక పాత్ర పోషిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటిత శక్తి అవసరమని, ప్రతి కార్మికుడిని సంఘం పరిధిలోకి తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఐఎన్‌టీయూసీని మరింత పటిష్టం చేయడానికి సభ్యత్వ నమోదుకు ప్రాధాన్యతనిస్తూ, గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, వివిధ విభాగాల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు పేర్కొన్నారు. కార్మికుల ఐక్యతను పెంపొందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏరియా సెక్రటరీలు చీటి చందూమోహన్, సంఘా వనదీప్, పూనెం రామకృష్ణ, సంతోష్, యూత్ వింగ్ కన్వీనర్ ఎల్లుల ప్రవీణ్‌తో పాటు వివిధ గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, డిపార్ట్‌మెంట్ల పిట్ సెక్రటరీలు, కార్మిక ప్రతినిధులు, ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి కార్మిక సమస్యలపై దశలవారీ పోరాటాలు చేయాలి

మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలి టిబిజికెఎస్ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి

శ్రీరాంపూర్ ఏరియా కార్యవర్గ సమావేశంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకుల పిలుపు

మంచిర్యాల, 29, అక్టోబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అమలు చేయాలని, కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం సింగరేణి వ్యాప్తంగా దశలవారీ పోరాటాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి లు తెలిపారు. కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడుతూ, యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా కార్యవర్గ సమావేశం ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి 61 మంది సభ్యులు హాజరయ్యారు. తొలుత బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు కీర్తిశేషులు పి.టి. స్వామికి నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా సంఘానికి, కార్మికులకు ఆయన అందించిన సేవలను నాయకులు కొనియాడారు. ఈ సమావేశంలో యూనియన్ బలోపేతం, కార్మిక సమస్యలు, సభ్యత్వ నమోదు, కార్మికుల భద్రత, సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. సింగరేణిలో అతిపెద్ద ఏరియాగా ఉన్న శ్రీరాంపూర్‌లోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో ఎక్కువ మంది కార్మికులతో ఫిట్ కమిటీలను నిర్వహించాలని రాష్ట్ర నాయకులు సూచించారు. యూనియన్ నాయకులు కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ, ఫిట్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని, వాటిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఏరియాలో సాధ్యమైనంత ఎక్కువ మంది కార్మికులను యూనియన్ సభ్యులుగా చేర్చుకొని సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గనుల్లో పనిచేసే కార్మికులకు అవసరమైన వ్యక్తిగత రక్షణ పరికరాల (పి.పి.ఈ.) కిట్లు, నాణ్యమైన పనిముట్లు అందించాలని, కార్మికులు విధులు నిర్వహించే ప్రదేశాల్లో సరిపడా గాలి, నీటి సౌకర్యాలు కల్పించాలని నాయకులు కోరారు. కార్మికుల పని పరిస్థితులను మెరుగుపరచడంతోపాటు వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు కొనసాగించాలని స్పష్టం చేశారు. సింగరేణి వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో కార్మిక వర్గం తీవ్ర నిరాశకు గురైందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక విధానాలపై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు స్పందించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారంతోపాటు ఎన్నికల హామీల అమలుకు సింగరేణి వ్యాప్తంగా పోరాట కార్యాచరణ రూపొందిస్తున్నామని, రానున్న రోజుల్లో చేపట్టే దశలవారీ పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, అక్టోబర్ నెలలో మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో అనారోగ్య కారణాల వల్ల విధులు నిర్వహించలేకపోతున్న కార్మికులు, అయ్యర్ రిఫరల్‌కు వెళ్లిన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. సంబంధిత కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న కార్మికులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పెట్టం లక్ష్మణ్, కేంద్ర జాయింట్ సెక్రటరీలు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఎం.డి. లాలా, గడ్డం వెంకట్ రెడ్డి, కార్యవర్గ సభ్యుడు నీలం సదయ్య, ఏరియా కార్యదర్శులు గడ్డం మైపాల్ రెడ్డి, గొర్ల సంతోష్, వెంగళ కుమారస్వామి, ఉత్తేజ్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కోశాధికారి చిలుకూరి జగదీష్‌తో పాటు అన్ని గనుల ఫిట్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

శ్రీరాంపూర్‌లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు

మంచిర్యాల, 29, అక్టోబర్ (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో ఐఎన్‌టీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ బ్రాంచ్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్లు ల్యాగల శ్రీనివాస్, శీలం చిన్నయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు పి. ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య విశిష్ట అతిథులుగా హాజరుకాగా, సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్లు భీంరావు, తిరుపతి రాజు, కలవెన శ్యామ్, జనరల్ సెక్రటరీలు డాక్టర్ ఏనుగు రవీందర్‌రెడ్డి, జీవన్ జోయల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గరిగ స్వామి, సెంట్రల్ సెక్రటరీలు పిన్నింటి మల్లారెడ్డి, కాకూరి మనోజ్ వర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మరింత కృషి చేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా మంత్రి మరిన్ని విజయాలు సాధించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సెక్రటరీలు చీటి చందూమోహన్, సంఘా వనదీప్, పూనెం రామకృష్ణ, సంతోష్, యూత్ వింగ్ కన్వీనర్ ఎల్పుల

ప్రవీణ్‌తో పాటు శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులు, ఓపెన్‌కాస్ట్ (ఓసీ) ప్రాజెక్టులు, డిపార్ట్‌మెంట్ల పిట్ సెక్రటరీలు, కార్మిక ప్రతినిధులు, యూనియన్ కార్యకర్తలు పాల్గొని వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

ఎన్‌హెచ్--63 భూసేకరణలో గ్రామసభలు నిర్వహించకుండా అవార్డులు ఎలా పాస్ చేస్తారు..?

ఎన్‌హెచ్ఏఐ కార్యాలయం ఎదుట బాధిత రైతుల ధర్నా..

ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్ మణికుమార్ కు వినతిపత్రం

మంచిర్యాల, 29, అక్టోబర్ (ప్రజాజ్యోతి):నేషనల్ హైవే--63 భూసేకరణలో బాధిత రైతులకు న్యాయం చేయాలని, గ్రామసభలు నిర్వహించకుండా అవార్డులు పాస్ చేయడంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) కార్యాలయం ఎదుట బాధిత రైతులు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్ మణికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు తులా మధుసూదన్‌రావు మాట్లాడుతూ, నేషనల్ హైవే--63 రహదారి అలైన్‌మెంట్ మార్పుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అలైన్‌మెంట్ మార్పుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టలేదని, గ్రామసభలు నిర్వహించలేదని అన్నారు. అవార్డులు పాస్ చేసే సమయంలోనూ గ్రామసభలు నిర్వహించకుండా, చట్టవిరుద్ధంగా అవార్డులకు అనుమతించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు నివేదికలు పంపడం రైతులకు అన్యాయం చేయడమేనని అన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన, రైతు ప్రభుత్వం అంటూ ప్రచారం చేసుకుంటూ, మరోవైపు ప్రభుత్వ అధికారుల ద్వారా రైతులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన విధానాలను పాటించకుండా, గ్రామసభలు నిర్వహించకుండానే అవార్డులు పాస్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు నోటీసులు ఇచ్చి సంతకాలు సేకరించినంత మాత్రాన దానిని ప్రజాభిప్రాయ సేకరణగా పరిగణించలేరని, అదే ప్రజాభిప్రాయ సేకరణగా పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు సమాచారం అందించడం వల్లే అవార్డులు పాస్ అయ్యాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు అందించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలతోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. హైకోర్టు విచారణ ఉండగా చర్యలెందుకన్నారు . ఈ ధర్నాలో పాల్గొన్న బాధిత రైతులు మాట్లాడుతూ, భూసేకరణకు సంబంధించిన కేసు హైకోర్టులో విచారణలో ఉండగానే, న్యాయస్థానాన్ని కూడా బేఖాతరు చేస్తూ తమ భూములను సేకరించేందుకు నోటీసులు జారీ చేయడం, అవార్డులు పాస్ చేయడం జరుగుతోందని ఆరోపించారు. నవంబర్ 16న హైకోర్టులో ఈ కేసు విచారణకు రానున్న నేపథ్యంలో, అప్పటివరకు రైతులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నివేదికలను గుడ్డిగా నమ్మకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించాలని కోరారు. అవార్డుల కోసం పంపిన నివేదికలతోనే భూసేకరణ ప్రక్రియలో అధికారుల పారదర్శకతపై అనుమానాలు

వ్యక్తమవుతున్నాయని అన్నారు. కేంద్ర స్థాయిలో తమ సమస్య పరిష్కారానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నప్పటికీ, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రాజకీయాలు, వర్గపోరాటాలకే ప్రాధాన్యమిస్తూ రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు అన్యాయం చేసిన ప్రభుత్వాలు, నాయకులు గతంలో ప్రజల ఆదరణ కోల్పోయిన విషయాన్ని గుర్తించాలని, ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. భూసేకరణ ప్రక్రియలో తప్పిదాలకు బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బీజేపీ సీనియర్ నాయకుడు తులా మధుసూదన్‌రావు తో పాటు రైతులు లెగిశెట్టి రాజమౌళి, వొడ్నాల శ్యాంసుందర్, పరమేష్, దాస్య నాయక్, సాంబారు తిరుపతి, కస్తూరి మల్లేష్, సీహెచ్ జగన్, శ్రీనివాస్, లింగయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జర్మనీ ఆటోమోటివ్ రంగంలో తెలంగాణ యువతకు ఉద్యోగావకాశాలు

పోర్షే వంటి అంతర్జాతీయ సంస్థలతో పనిచేసే కంపెనీతో చర్చలు..

ఐటీఐ పెయింటింగ్ ట్రేడ్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశం

మంచిర్యాల, 29, అక్టోబర్ (ప్రజాజ్యోతి):తెలంగాణ రాష్ట్రంలోని నైపుణ్యం కలిగిన యువతకు జర్మనీ ఆటోమోటివ్ రంగంలో అంతర్జాతీయ స్థాయి ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామితో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. జర్మనీలోని ప్రముఖ ఆటోమోటివ్ సంస్థలతో కలిసి పనిచేస్తున్న కోటింగ్ కాన్సెప్ట్ జీఎంబీహెచ్ ప్రతినిధి జనీనా రడోవిక్, ఆమె బృందం, టామ్‌కామ్ అధికారులు, ఇండో-యూరో సింక్రనైజేషన్ ప్రతినిధి రాజ్ వంగపండు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆటోమోటివ్ పెయింటింగ్‌లో ప్రత్యేక అవకాశాలు అన్నారు . జర్మనీలో ఆటోమోటివ్ స్ప్రే పెయింటింగ్, కోటింగ్ విభాగాల్లో నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులకు మంచి ఉద్యోగావకాశాలు ఉన్నట్లు సమావేశంలో గుర్తించారు. పోర్షే వంటి ప్రపంచ ప్రఖ్యాత కార్ల తయారీ సంస్థలతో అనుబంధంగా పనిచేసే పారిశ్రామిక రంగంలో తెలంగాణ యువతకు ఉపాధి కల్పించే అవకాశాలపై చర్చించారు. స్థానిక యువతకు ఉన్న సాంకేతిక నైపుణ్యాలను అంతర్జాతీయ పారిశ్రామిక ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంపై దృష్టి సారించారు. జర్మనీలో

ఉద్యోగాలు పొందే యువత అక్కడి పని వాతావరణానికి సులభంగా అలవాటు పడేలా సాంకేతిక శిక్షణతో పాటు జర్మన్ భాషలోనూ శిక్షణ అందించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా యువతకు విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం సనత్‌నగర్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో మాత్రమే అందుబాటులో ఉన్న ప్రత్యేక పెయింటింగ్ ట్రేడ్‌ను తెలంగాణవ్యాప్తంగా ఇతర ప్రభుత్వ ఐటీఐ కళాశాలలకు కూడా విస్తరించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. దీనివల్ల మరింత మంది యువతకు

పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణ పొందే అవకాశం కలుగుతుంది. త్వరలో రాబోయే త్రైమాసికంలోనే నియామక ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఐటీఐలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఆటోమోటివ్ పెయింటింగ్ రంగంలో అనుభవం కలిగిన నిపుణులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శిక్షణ వ్యవస్థను అంతర్జాతీయ పరిశ్రమల అవసరాలకు అనుసంధానించడం ద్వారా తెలంగాణ యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి ఊతం లభించనుంది.

దండేపల్లి ప్రభుత్వ పిఎం శ్రీ జడ్పీ హైస్కూల్‌లో కెరీర్ గైడెన్స్ సదస్సు

దండేపల్లి, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వారు ఆచరించే సమున్నత జీవనశైలి, పాటించే ఉన్నత అలవాట్లే బలమైన పునాదిగా నిలుస్తాయని ప్రముఖ రచయిత, కాలమిస్ట్, విశ్రాంత ప్రిన్సిపాల్, వ్యక్తిత్వ వికాస నిపుణులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. 'లీడ్ ఇండియా-2047' ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ పిఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 'ఎక్స్‌పర్ట్ మెంటరింగ్, కెరీర్ కౌన్సిలింగ్, కెరీర్ గైడెన్స్' అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బి. మధుసూదన్ రెడ్డి, సైకాలజిస్ట్ గాలిపలి నాగేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యను నమ్ముకొని, కష్టపడి చదివి పేదరికాన్ని జయించి దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. లీడ్ ఇండియా ఫౌండేషన్ శిక్షణ సమన్వయకర్త మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే మంచి అలవాట్లు, సత్ప్రవర్తనతో పాటు నేడు చేసే 'స్మార్ట్ వర్క్' ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై నమ్మకంతో మునుపటి ఫలితాలను అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ప్రతి అంశంపై అవగాహన పెంచుకుంటూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. గౌరవ అతిథి శ్రీనివాస్ ఆచార్య మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి విద్యార్థులు నడుం బిగించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంగర్సు రాజేశ్వరరావు సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, 200 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది.

ముత్యంపేటలో 'ఖేత్ బచావో అభియాన్'.. రైతులకు అవగాహన

దండేపల్లి, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): దండేపల్లి మండలంలోని ముత్యంపేట గ్రామంలో గురువారం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్' (నేల తల్లి రక్షణ ఉద్యమం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు భూసార పరిరక్షణ, నేల ఆరోగ్యం, భూసార పరీక్షల ప్రాముఖ్యత, సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల వాడకం, నీటి సంరక్షణ అలాగే పంటల వైవిధ్యీకరణపై విస్తృతమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, పరీక్ష ఫలితాల ఆధారంగానే ఎరువులను వినియోగించాలని సూచించారు. భూమిలో సారాన్ని కాపాడుకుంటూ సాగు ఖర్చులను తగ్గించుకోవాలని, రసాయన ఎరువులు, పురుగుమందులను అధిక మోతాదులో వాడకుండా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించాలని తెలిపారు. ముఖ్యంగా పంట అవశేషాలను ఎక్కడా తగులబెట్టకుండా నేల ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు స్థిరమైన, లాభసాటి వ్యవసాయ విధానాలను అవలంబించాలని ఈ కార్యక్రమం ద్వారా విజ్ఞప్తి చేశారు.? ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి, తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

బెజ్జూరులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బెజ్జూరు అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి) పేకాట స్థావరాల పై దాడి ఐదుగురు పట్టివేత. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసు దాడి నిర్వహించగా. పేకాట ఆడుతూ ఐదుగురు పట్టుబడినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. పట్టుబడిన వ్యక్తుల వివరాలు శివ ప్రసాద్ శంకర్. గంగయ్య. తిరుపతి. ఓదెలు. వీరి వద్ద నుంచి 52 పేకముక్కలు, నగదు రూ. 2,500 రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

భారతీయ జనతా పార్టీ దండేపల్లి మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా గడిగొప్పుల రజిని

దండేపల్లి, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దండేపల్లి మండల మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కన్నెపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గడిగొప్పుల రజిని నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వ ఆదేశాల మేరకు మండల పార్టీ నాయకులు ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడిగొప్పుల రజిని మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మండల మహిళా మోర్చా బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, గ్రామస్థాయిలో మహిళలను సంఘటితం చేస్తూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సైనికులా పని చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ నియామకం పట్ల పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు గడిగొప్పుల రజినికి పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా అభినందనలు తెలిపారు.

భూగర్భ జలాలను కాపాడాలి ....

బెజ్జూర్ అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ మహిళా సంఘాల అధ్యక్షులు, గ్రామపంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన బండారి ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. ఇంటికో ఇంకుడు గుంత, రైతుకు పంట కుంట, ఊరికి ఊట కుంట ఏర్పాటు చేసుకోవడం తో పాటు బోర్ వెల్ రీఛార్జ్ నిర్మాణం చేస్తూ నీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చున్నారు. తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న 38 రకాల వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై పొందాలని తెలిపారు. పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పశుగ్రాసం సాగుకు ఎకరాకు రూ. 14 వేల సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విబిజి రాంజీ పథకంలో భాగంగా కోళ్ల పెంపకం, పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ రాజేందర్ మాట్లాడుతూ.. కొత్త మహిళా సంఘాలకు రుణాలు అందిస్తామని తెలిపారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి బ్యాంకు ఖాతాల్లో లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపిఎం మోహన్ దాస్ మాట్లాడుతూ. మన సంగంలో వచ్చే లోన్స్ తిరిగి కిస్తీ రూపంలో కట్టాలి కానీ ఈ వ్యవసాయ పని ముట్లు ప్రభుత్వం 50% సబ్సిడీ మహిళలకి ఇస్తుంది కాబట్టి మళ్లీ కట్టేది ఉండదు. కాబట్టి ఇదీ అందరు వినియోగించు కోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సీసీలు రంగయ్య, భద్రయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, మాదకద్రవ్య రహిత కమిషనరేట్‌గా రామగుండం

డ్రగ్స్ సరఫరా మూలాలను సమూలంగా ఛేదించాలి

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

పెడ్లర్లపై నిరంతర నిఘా.. సరఫరా నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

ఈగిల్ టీమ్ ఎస్పీ గిరిధర్

గంజాయికి అలవాటుపడిన 55 మంది యువతకు కౌన్సెలింగ్

మంచిర్యాల, 29, అక్టోబర్ (ప్రజాజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్‌ను గంజాయి, ఇతర మాదకద్రవ్య రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దేందుకు సరఫరా వ్యవస్థ మూలాలను సమూలంగా ఛేదించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, తెలంగాణ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఈగిల్ టీమ్) ఎస్పీ గిరిధర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడే పెడ్లర్లపై నిరంతర నిఘా కొనసాగించడంతో పాటు, వారికి మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులను గుర్తించి మొత్తం నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేయాలని స్పష్టం చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) కేసుల పురోగతి, పెండింగ్ కేసులు, దర్యాప్తు స్థితిగతులు, నిందితుల కార్యకలాపాలు, గంజాయి సరఫరా మార్గాలపై ఈగిల్ టీమ్ ఎస్పీ గిరిధర్ సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్ కేసులకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో దర్యాప్తు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల గుర్తింపు, సరఫరా మూలాల అన్వేషణలో వృత్తిపరమైన నైపుణ్యంతో వ్యవహరించాలని సూచించారు. గంజాయి విక్రయించే వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతోనే దర్యాప్తును పరిమితం చేయకూడదని ఎస్పీ గిరిధర్ తెలిపారు. పెడ్లర్లకు గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరు సరఫరా చేస్తున్నారు? ఏ మార్గాల్లో రవాణా చేస్తున్నారు? అనే అంశాలపై లోతుగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. సరఫరా గొలుసులోని ప్రతి స్థాయిని గుర్తించి, చిన్నస్థాయి విక్రేతల నుంచి ప్రధాన సరఫరాదారుల వరకు మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, ప్రదేశాలు, రవాణా మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, నిల్వలు, రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్ట నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ కేసుల దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు. మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులు అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించి, చట్టపరమైన విధానాలను అనుసరిస్తూ వాటిని సీజ్ లేదా ఫ్రీజ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిందితులకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులు, సరఫరా మార్గాలు, ఆర్థిక లావాదేవీలు, నెట్‌వర్క్‌పై దృష్టి సారించి దర్యాప్తును విస్తరించాలని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం కేసులు నమోదు చేయడంతో సాధ్యం కాదని, సరఫరా మూలాలను ఛేదించడంతో పాటు వినియోగదారులను గుర్తించి కౌన్సెలింగ్ అందించడం, యువతలో అవగాహన పెంపొందించడం వంటి బహుముఖ చర్యలు అవసరమని కమిషనర్ పేర్కొన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం, మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, సరఫరా వ్యవస్థను సమూలంగా నిర్మూలించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశం సందర్భంగా రామగుండం కమిషనరేట్ పరిధిలో గంజాయి వినియోగానికి అలవాటుపడిన 55 మంది యువతతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఈగల్ టీమ్ ఎస్పీ గిరిధర్ మాట్లాడి కౌన్సెలింగ్ అందించారు. యువతలోని శక్తి, సామర్థ్యాలను సానుకూల దిశలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సీపీ సూచించారు. ఒత్తిడి, చెడు స్నేహాలు, తాత్కాలిక ఆకర్షణల కారణంగా మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారు వాటికి పూర్తిగా దూరమై, అవసరమైనప్పుడు పునరావాస సహాయం పొందుతూ కొత్త జీవితాన్ని ప్రారంభించాలని హితవు పలికారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబం, విద్య, ఉపాధి, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే బాధ్యత యువతపై ఉందని గుర్తుచేశారు. విద్య, సాంకేతిక నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనలో పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, అవసరమైన యువతకు ప్రత్యేక బృందాల ద్వారా నిరంతర సహాయం, మార్గదర్శకత్వం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ జీవితాన్ని మార్చుకోవాలని, మంచి పౌరులుగా ఎదిగి కుటుంబాలకు గర్వకారణంగా నిలవాలని యువతకు పిలుపునిచ్చారు. ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తులో పోలీస్ స్టేషన్ల అధికారులు, టాస్క్‌ఫోర్స్, ఈగిల్ టీమ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. మాదకద్రవ్యాల సరఫరా, రవాణా, విక్రయాలపై అందే సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించి, సంబంధిత నెట్‌వర్క్‌పై ఏకకాలంలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందే సమాచారాన్ని ప్రాధాన్యతతో పరిశీలిస్తూ, సమాచారదాతల వివరాలను గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, జైపూర్ ఏసీపీ ఆర్. వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్, ఈగిల్ ఫోర్స్ కరీంనగర్ ఆర్ఎన్‌సీసీ డీఎస్పీ ఎస్. ఉపేందర్, నిజామాబాద్ ఆర్ఎన్‌సీసీ డీఎస్పీ సోమనాథ్, హైదరాబాద్ ఆర్ఎన్‌సీసీ డీఎస్పీ పుష్పకుమార్‌తో పాటు సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నైతం రాజు సేవలు వెలకట్టలేనివి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఆసిఫాబాద్, అక్టోబర్ 29 ప్రజా జ్యోతి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘంలో చురుకుగా పనిచేస్తూ, పార్టీ అభివృద్ధికి నైతం రాజు చేసిన సేవలు వెలకట్టలేనివని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నా రు. జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో నిర్వహించిన నైతం రాజు సంస్మరణ సభలో ఆయన పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. జిల్లాలోని మారుమూల గ్రామంలో జన్మించిన నైతం రాజు 2015లో తన ప్రస్థానాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగారని గుర్తుచేశా రు. ఆదివాసీ గిరిజనుల సమస్యలపై పనిచేస్తూ, పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేశారని పేర్కొన్నారు. రాజు మరణం పార్టీకి, ఆదివాసీ గిరిజన సంఘానికి తీరని లోటని అన్నారు. ఆయన లేని లోటును పూడ్చడం సాధ్యం కాదని పేర్కొన్నారు. రాజు కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు బండారి రవికుమా ర్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్, జిల్లా కార్యదర్శి కూసన రాజన్న, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, మహాజన పాదయాత్ర బృందం సభ్యుడు ఆవాజ్, పార్టీ జిల్లా నాయకులు దుర్గం దినకర్, శ్రీనివాస్, జె. రాజేందర్, ఆనంద్, కార్తీక్, టీకానంద్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో అర్ధరాత్రి రౌడీషీటర్ల ఇళ్లలో పోలీసుల తనిఖీలు

సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్లు తొలగించే అంశంపై పరిశీలన

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్

మంచిర్యాల, 29, అక్టోబర్ (ప్రజాజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మంచిర్యాల పోలీసులు అర్ధరాత్రి రౌడీషీటర్ల ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం అర్ధరాత్రి మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని తిలక్‌నగర్‌లో నిర్వహించిన ఈ తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్, ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రౌడీషీటర్ల ప్రస్తుత పరిస్థితి, కార్యకలాపాలు, ప్రవర్తన తదితర అంశాలను పోలీసులు పరిశీలించారు. అనంతరం రౌడీషీటర్లతో మాట్లాడి కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు, భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా చట్టాన్ని గౌరవిస్తూ ప్రశాంతమైన జీవనం కొనసాగించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం, గొడవలు సృష్టించడం, ఇతరులను బెదిరించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరిస్తూ సత్ప్రవర్తనతో జీవించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా డీసీపీ ఎ. భాస్కర్ మాట్లాడుతూ, రౌడీషీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని, భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో జీవిస్తే, నిబంధనల

ప్రకారం వారి రౌడీషీట్లను తొలగించే అంశాన్ని పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. అదే సమయంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, గొడవలు సృష్టించినా, బెదిరింపులకు దిగినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా అలాంటి వారిపై నిబంధనల ప్రకారం రౌడీషీట్లు తెరవడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు తిరిగి నేర కార్యకలాపాలకు పాల్పడినా, అసాంఘిక శక్తులతో సంబంధాలు కొనసాగించినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా పోలీసులు ఉపేక్షించబోరని డీసీపీ స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు,

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రౌడీషీటర్ల కదలికలు, ప్రవర్తనపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం తెలిసినట్లయితే ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసులకు తెలియజేయాలని డీసీపీ విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో నేరరహిత, ప్రశాంత వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

బియ్యం అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

కృత్రిమ కొరత సృష్టిస్తే ఉపేక్షించేది లేదు.. వ్యాపారులకు అదనపు కలెక్టర్ హెచ్చరిక

మంచిర్యాల, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): జిల్లాలో బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాకు పాల్పడటం, అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ప్రజల్లో ఆందోళన కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు హెచ్చరించారు. బియ్యం నిల్వలు, సరఫరా, ధరల నియంత్రణ విషయంలో వ్యాపారులు పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశానికి జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, బియ్యం వ్యాపారులు, హోల్‌సేల్ వ్యాపారులు, కిరాణా వర్తకులతో బియ్యం నిల్వలు, ధరల నియంత్రణ, మార్కెట్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ

పాల్పడరాదని స్పష్టం చేశారు. ప్రజల్లో అనవసర భయాందోళనలు కలిగించే విధంగా వ్యవహరించవద్దని సూచించారు. ప్రతి వ్యాపారి తమ వద్ద అందుబాటులో ఉన్న బియ్యం నిల్వల వివరాలను రోజువారీగా స్టాక్ బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని, విక్రయ ధరలను సైతం వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా వ్యాపారులు సహకరించాలని తెలిపారు.

మార్కెట్‌లో అనవసర ధరల పెరుగుదల, అక్రమ నిల్వలు చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిత్యావసర వస్తువుల చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీహెచ్‌ఓ, డీఎంఓ, డీటీసీఎస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ అక్టోబర్ 29 ప్రజా జ్యోతి జిల్లాలో రహదారిరహదారి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశానికి ఎస్.పి. నితికా పంత్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని, జాతీయ రహదారులు, ఇతర రహదారులలో ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. సమాధానం రాయబడిన వారికి ప్రధానమంత్రి రహత్ పథకం క్రింద ఉచితంగా చికిత్స అంది అవకాశం ఉందని తెలిపారు. ప్రతి వాహన దారుడు హెల్మెట్ / సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులు భవనాలు, పంచాయతీరాజ్ రహదారులపై గుంతలను వెంటనే పూడ్చాలని, మూలమలుపుల వద్ద చెట్ల కొమ్మలు, పిచ్చి చెట్లను తొలగించాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రత నియమావళి పై

అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలలో రహదారులపై పశువులు సంచరించకుండా పశువుల యజమానులకు నోటీసులు జారీ చేయాలని, రహదారి ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ నెలరోజుల వ్యవధిలో రహదారు ప్రమాదాలలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్, రహదారులు భవనాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ అక్టోబర్ 29, ప్రజా జ్యోతి జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు ఒక లక్ష్యంతో ముందుడుగు సాగాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని కెరమెరి మండలం దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమగ్ర ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగేంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని జిల్లా నుండి నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి అవసరమైన మందులు, పోషక ఆహారం 6 నెలల పాటు క్రమ తప్పకుండా తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. క్షయ వ్యాధిని నిర్మూలించడంలో ప్రారంభ దశలోనే గుర్తించక పోతే ఇతరులకు వ్యాపిస్తుందని తెలిపారు. క్షయ వ్యాధి లక్షణాలు కలిగిన వ్యక్తులు నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద చాల మంచి ఇండ్లు రాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ అర్హులైన అందరికీ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో నాణ్యత ప్రమాణాలతో ఇండ్లు నిర్మించుకోవాలని తెలిపారు. గ్రామములో టి డబ్ల్యు పి ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని చిన్నారులకు చాక్లెట్లు అందించారు. అంతకుముందు క్షయ వ్యాధి నిర్మూలన వాహనాలను జండా ఊపి ప్రారంభించారు. అందరూ సమన్వయంతో కృషి చేసి క్షయ రహిత గిరిజన గ్రామాలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి వినయ్‌కుమార్, కొలంగూడ సర్పంచ్ కుమ్రంభీం రావు, ఉప సర్పంచ్ బారిక్ రావు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పద్మల్ పురి కాకో ఆలయంలో దండారి, గుస్సాడి ఉత్సవాల గోడ పత్రాల ఆవిష్కరణ

దండేపల్లి, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): దండేపల్లి మండలం గుడిరేవు గ్రామంలోని చారిత్రాత్మక శ్రీ పద్మల్ పురి కాకో ఆలయం లో నవంబర్ 1 నుండి 11 వరకు వైభవంగా నిర్వహించనున్న దండారి, గుస్సాడి ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రాలను (వాల్ పోస్టర్స్) గురువారం తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆదివాసీల ఆచార వ్యవహారాలు, గొప్ప సంస్కృతిని ప్రతిబింబించే దండారి, గుస్సాడి ఉత్సవాలను గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో విజయవంతం కావాలని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆదివాసీ నాయకులు కనక జంగు, జలపతి, లింగారావ్, లాల్ సాబ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బొద్దుల భూమన్న తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను దిగ్విజయం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రూ.50 వేలు డిమాండ్.. రూ.22 వేలు తీసుకుంటుండగా పట్టివేత!

ఏసీబీకి చిక్కిన జీపీఓ శ్రీనివాస్

ఆసిఫాబాద్ అక్టోబర్ 29 ప్రజా జ్యోతి భూమి వారసత్వ మార్పిడి ప్రక్రియ కోసం లంచం తీసుకుంటుండగా కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న జీపీఓ శ్రీనివాస్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తొలుత రూ.50 వేలు డిమాండ్ చేసి, చివరకు రూ.22 వేలు తీసుకునేందుకు అంగీకరించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఏసీబీ అధికారుల సమాచారం ప్రకారం.. ఫిర్యాదుదారుడి తాతగారికి సంబంధించిన భూమి వారసత్వ మార్పిడి కోసం అవసరమైన రికార్డుల తయారీ, ఆధార్ కార్డులోని వివరాలకు సంబంధించిన సమస్య పరిష్కార ప్రక్రియలో జీపీఓ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో గురువారం ఏసీబీ ఆదిలాబాద్ విభాగం డీఎస్పీ మధు ఆధ్వర్యంలో అధికారులు కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో దాడి నిర్వహించారు. ఫిర్యాదుదారుడి నుంచి రూ.22 వేలు తీసుకుంటుండగా శ్రీనివాస్‌ను పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి తదుపరి విచారణ, చట్టపరమైన చర్యలు కొనసాగనున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ పనికైనా అధికారులు లేదా సిబ్బంది లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఉప ముఖ్యమంత్రి హామీల అమలు ఎప్పుడు?

దీపావళిలోగా సొంతింటి కల నెరవేర్చాలి..
పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి
సింగరేణిలో మళ్లీ ఆందోళనలు చేపడతాం
సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి

మంచిర్యాల, 29,అక్టోబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తుమ్మల రాజారెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆర్కే-7 గనిపై కార్మికులను కలుసుకుని ఆయన మాట్లాడుతూ, లాభాల వాటా పంపిణీ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించిన హామీలను దీపావళిలోగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే సింగరేణిలో మరోసారి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మెడికల్ బోర్డు నిర్వహణలో జాప్యమెందుకు?

సాక్షాత్తు ముఖ్యమంత్రి స్థాయిలో మెడికల్ బోర్డు నిర్వహణపై హామీ ఇచ్చినప్పటికీ, ఈ నెలలో ఇప్పటివరకు బోర్డు ఎందుకు నిర్వహించలేదని రాజారెడ్డి ప్రశ్నించారు. విజిలెన్స్ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఆ దిశగా చర్యలు కనిపించడం లేదన్నారు. విజిలెన్స్ కేసుల కారణంగా నిలిచిపోయిన కార్మికుల పిల్లల ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇప్పటివరకు ఆఫీస్ ఆర్డర్లు ఎందుకు జారీ చేయడం లేదని ప్రశ్నించారు. అనారోగ్య కారణాలతో విధులు నిర్వహించలేక పోతున్న అనేకమంది కార్మికులు తరచూ గైర్హాజరవుతూ డిస్మిస్ అయ్యే పరిస్థితికి చేరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కార్మికులకు మెడికల్ బోర్డు నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డుల్లో తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికులకు ఇన్వాలిడేషన్ అవకాశం కల్పించకపోవడం వల్ల వారు విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇన్వాలిడేషన్‌కు సంబంధించి అమలులో ఉన్న ఏడాది నిబంధనను సవరించి, బాధిత కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

దీపావళిలోగా సొంతింటి కల నెరవేర్చాలి

సింగరేణి కార్మికుల సొంతింటి కలను దీపావళిలోగా నెరవేర్చాలని రాజారెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే సహించేది లేదని, అవసరమైతే సింగరేణి వ్యాప్తంగా మరోసారి ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని పెంచిన కారణంగానే అధికారాన్ని కోల్పోయిందని పేర్కొంటూ, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ధోరణిని కొనసాగిస్తే ప్రజల నుంచి అలాంటి వ్యతిరేకతనే ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోకుండా వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు.

12వ వేతన ఒప్పందంపై బీజేపీ నేతల మౌనమెందుకు?

సింగరేణి కార్మికులపై తమకు ఎంతో ప్రేమ ఉందని చెప్పుకునే బీజేపీ ప్రభుత్వం 12వ వేతన ఒప్పందం ఏర్పాటు విషయంలో ఎందుకు స్పందించడం లేదని రాజారెడ్డి ప్రశ్నించారు. తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ అంశంపై ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. ఎన్నికల సమయంలో కార్మికుల సమస్యలపై హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారిందని విమర్శించారు. సింగరేణి సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రభుత్వాలు తమకు రావాల్సిన డివిడెండ్ల నుంచి సర్దుబాటు చేసైనా సంస్థకు బకాయిలు చెల్లించాలని కోరారు. సంస్థ ఆర్థికంగా బలోపేతమైతేనే కార్మికుల సంక్షేమంతో పాటు బొగ్గు బెల్ట్ ప్రాంత అభివృద్ధికి మరిన్ని అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే-7 ఫిట్ సెక్రటరీ మెల్లం శ్రీధర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ సమ్మయ్యతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

కృత్రిమ కొరత సృష్టిస్తే ఉపేక్షించేది లేదు..
వ్యాపారులకు అదనపు కలెక్టర్ హెచ్చరిక

మంచిర్యాల, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): జిల్లాలో బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాకు పాల్పడటం, అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ప్రజల్లో ఆందోళన కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు హెచ్చరించారు. బియ్యం నిల్వలు, సరఫరా, ధరల నియంత్రణ విషయంలో వ్యాపారులు పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశానికి జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, బియ్యం వ్యాపారులు, హోల్‌సేల్ వ్యాపారులు, కిరాణా వర్తకులతో బియ్యం నిల్వలు, ధరల నియంత్రణ, మార్కెట్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడరాదని స్పష్టం చేశారు. ప్రజల్లో అనవసర భయాందోళనలు కలిగించే విధంగా వ్యవహరించవద్దని సూచించారు. ప్రతి వ్యాపారి తమ వద్ద అందుబాటులో ఉన్న బియ్యం నిల్వల వివరాలను రోజువారీగా స్టాక్ బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని, విక్రయ ధరలను సైతం వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా వ్యాపారులు సహకరించాలని తెలిపారు. మార్కెట్‌లో అనవసర ధరల పెరుగుదల, అక్రమ నిల్వలు చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిత్యావసర వస్తువుల చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీహెచ్‌ఓ, డీఏంఓ, డీటీసీఎస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలి

అటవీ భూములపై క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే మున్సిపల్ అధికారులపై చర్యలు

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార దీపక్

మంచిర్యాల, 29,అక్టోబర్ (ప్రజాజ్యోతి): ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను నిర్దేశించిన నిబంధనలు, అర్హతలు, గడువులకు అనుగుణంగా సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, క్రమబద్ధీకరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ప్రభుత్వ ఉత్తర్వులు 59, 76 అమలుపై సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి క్రమబద్ధీకరణ ప్రక్రియ పురోగతి, అమలు చేయాల్సిన నిబంధనలపై గురువారం చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, సింగరేణి భూముల క్రమబద్ధీకరణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనలు, అర్హతలు, నిర్దేశిత గడువులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిర్దేశిత కటాఫ్ తేదీకి ముందుగా జరిగిన ఆక్రమణలకు మాత్రమే, సంబంధిత జీవోల్లోని నిబంధనల ప్రకారం అర్హత ఉన్న సందర్భాల్లో క్రమబద్ధీకరణ చేపట్టాలని స్పష్టం చేశారు.

అటవీ భూములపై సమగ్ర పరిశీలన

భూముల క్రమబద్ధీకరణకు ముందు సదరు భూములు అటవీ భూముల పరిధిలోకి వస్తాయా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ భూములకు సంబంధించిన చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అన్ని అంశాలను నిర్ధారించిన అనంతరమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వు 59 ప్రకారం 500 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి నిర్దేశించిన అర్హతలు, నిబంధనలను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.

సింగరేణి క్వార్టర్లపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఉత్తర్వు 76 అమలులో భాగంగా తహసీల్దార్లు, సింగరేణి అధికారులు సమన్వయంతో క్రమబద్ధీకరణ ప్రక్రియను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. సింగరేణి ఉద్యోగులు కానివారు సింగరేణి క్వార్టర్లలో నివాసం ఉంటున్నట్లు గుర్తిస్తే, నిబంధనల ప్రకారం వాటిని ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగరేణి నిర్మాణాల్లో నివాసం ఉంటున్న వారికి సంబంధిత మున్సిపాలిటీల ద్వారా ఆస్తి పన్ను విధించడం, ఇంటి నంబర్లు కేటాయించడం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా చర్యలు తీసుకున్నట్లు గుర్తిస్తే సంబంధిత మున్సిపల్ అధికారులపై తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, క్రమబద్ధీకరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, సింగరేణి అధికారులు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పోరాట యోధుడు కామ్రేడ్ గుజ్జ రమేష్‌కు ఘన నివాళి

సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో దశదిన కార్యక్రమం

మంచిర్యాల, 29,అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): సింగరేణి బొగ్గు గని కార్మికుల హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాల్లో ముందుండి నడిచిన కామ్రేడ్ గుజ్జ రమేష్‌కు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వినమ్రంగా నివాళులర్పించారు. బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన ఆయన దశదిన కార్యక్రమంలో రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కార్మిక ఉద్యమ సేవలను, ప్రజా పోరాటాల్లో పోషించిన పాత్రను నాయకులు స్మరించుకున్నారు. ఎంవీకే–3 బొగ్గు గనిలో విధులు నిర్వహించిన కామ్రేడ్ గుజ్జ రమేష్ సింగరేణి కార్మికులకు యాజమాన్యం నుంచి ఎక్కడ అన్యాయం జరిగినా ఎదిరించి నిలిచేవారని, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడేవారని నాయకులు పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంలో, హక్కుల సాధన ఉద్యమాల్లో ఆయన ముందుండేవారని గుర్తుచేశారు. ఆయన మరణం కార్మిక వర్గానికి, సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, 1978లో బెల్లంపల్లిలో చోటుచేసుకున్న రాజేశ్వరి అత్యాచారం, హత్య ఘటనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో గుజ్జ రమేష్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఎంవీకే–3 గనిలో పనిచేసే వెంకటేశ్వర్లు భార్య రాజేశ్వరికి జరిగిన అన్యాయంపై ఆయన సహచర కార్మికుడు వెంకటేశ్వర్లు వివరించడంతో రమేష్ వెంటనే స్పందించారని తెలిపారు. తన మిత్రులైన గజ్జల గంగన్న, పెద్ది శంకర్, పులి మదనయ్య తదితరులతో చర్చించి, నిందితుడిని చట్టపరంగా శిక్షించాలని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి జరిగిన ఆందోళనలు పోలీసు కాల్పుల వరకు దారితీశాయని, ఈ కాల్పుల్లో ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోగా పలువురు తీవ్రంగా గాయపడ్డారని వెంకటయ్య గుర్తుచేశారు. ఈ కేసులో గుజ్జ రమేష్‌పై కూడా పోలీసులు కేసులు నమోదు చేయడంతో ఆయన జైలు జీవితం అనుభవించారని, అయినప్పటికీ వెనుకడుగు వేయకుండా తన పోరాట పంథాను కొనసాగించారని తెలిపారు. రాడికల్ యువజన సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా 'దున్నేవాడికే భూమి' అనే నినాదంతో భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యమాల్లోనూ రమేష్ పాల్గొన్నారని వెంకటయ్య పేర్కొన్నారు. జననాట్య మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'భూభాగోతం' నాటకం ద్వారా రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు తనవంతు కృషి చేశారని వివరించారు. బెల్లంపల్లి పట్టణంలో రౌడీ, గూండా కార్యకలాపాలకు వ్యతిరేకంగా కూడా ఆయన తనదైన శైలిలో నిలిచేవారని తెలిపారు. అనారోగ్యంతో గుజ్జ రమేష్ మరణించడం బాధాకరమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని వెంకటయ్య అన్నారు. కార్మిక వర్గ హక్కుల కోసం ఆయన సాగించిన పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు "గుజ్జ రమేష్ అమర్ హై.. జోహార్ గుజ్జ రమేష్" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకటయ్యతో పాటు నాయకులు రాజనర్సు, దేవయ్య, స్వామి, రాజన్న, మురళి, పోషన్న, గుజ్జ రమేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీనియారిటీ ఆధారంగా పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్

461 క్వార్టర్ల కోసం కౌన్సెలింగ్..
74 మందికి నచ్చిన క్వార్టర్ల ఎంపిక

మంచిర్యాల, 29,అక్టోబర్ (ప్రజాజ్యోతి):సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల కోసం నిర్వహించిన క్వార్టర్ల మార్పిడి కౌన్సెలింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగింది. ఇప్పటికే క్వార్టర్లు కలిగి ఉన్న ఉద్యోగులు తమకు అనుకూలమైన క్వార్టర్లను ఎంచుకునేందుకు, మెరుగైన క్వార్టర్లకు మారేందుకు యాజమాన్యం ఈ కౌన్సెలింగ్ నిర్వహించింది.నస్పూర్, గోదావరి కాలనీ, ఆర్కే-6 కాలనీ, సీసీసీ టౌన్‌షిప్, కృష్ణ కాలనీ, శ్రీరాంపూర్ కాలనీ, ఆర్కే-8 కాలనీల్లో ఖాళీగా ఉన్న మొత్తం 461 క్వార్టర్ల కోసం గురువారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో కౌన్సెలింగ్ చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు విడతల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది.ఈ కౌన్సెలింగ్ కోసం మొత్తం 376 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 111 మంది హాజరయ్యారు. వీరిలో 74 మంది తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. ఉద్యోగుల సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకొని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు ఎస్‌ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఈఈ (సివిల్) అఖిల్ నాయక్, సీనియర్ పీఓ ప్రశాంత్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగింది. ఉద్యోగులకు పారదర్శకమైన విధానంలో క్వార్టర్ల ఎంపికకు అవకాశం కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీలో నూతన నియామకాలు

మంచిర్యాల, 29,అక్టోబర్ (ప్రజాజ్యోతి): సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించే లక్ష్యంతో మంచిర్యాల జిల్లాలో నూతన నియామకాలు చేపట్టారు. కమిటీ జిల్లా అధ్యక్షులు పెద్దల్ల చంద్రకాంత్ ఆధ్వర్యంలో ఈ నియామకాలు జరిగాయి.సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి గాడేచర్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు, జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎరిగేంద్ర వెంకటేష్ నిర్ణయాలతో పాటు రాష్ట్ర కార్యదర్శి పార్నంది రమేష్ చంద్ర సహకారంతో నియామకాలు చేపట్టినట్లు జిల్లా అధ్యక్షులు పెద్దల్ల చంద్రకాంత్ తెలిపారు.ఈ సందర్భంగా భీమశేఖర్‌ను మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా, కడారి సాయి కిరణ్‌ను మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా, కడారి హరీష్‌ను మందమర్రి మండల అధ్యక్షుడిగా నియమించారు. నూతనంగా నియమితులైన బాధ్యులకు పెద్దల్ల చంద్రకాంత్ నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు, ప్రభుత్వ శాఖల నుంచి చట్టప్రకారం సమాచారం పొందేందుకు పౌరులకు అవకాశం కల్పించే ముఖ్యమైన చట్టమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యాలయాల పనితీరుకు సంబంధించిన సమాచారాన్ని చట్ట పరిధిలో తెలుసుకోవడానికి ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. అయితే వ్యక్తిగత సమాచారం, చట్టంలోని మినహాయింపులకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు.సమాచార హక్కు చట్టంపై గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, చట్టాన్ని సద్వినియోగం చేసుకునే విధానంపై మార్గదర్శనం చేస్తామని వెల్లడించారు. ప్రజలు తమ హక్కులపై అవగాహన పెంచుకొని, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని చట్టబద్ధంగా పొందాలని పిలుపునిచ్చారు.నూతనంగా నియమితులైన కమిటీ బాధ్యులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై చైతన్యం తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కమిటీ బలోపేతానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

లిప్రాథమిక పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని నియమించాలి

36మంది విద్యార్థులకు ఒక్కరే టీచర్

కెరమెరి, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం లింగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 36మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండటంతో విద్యార్థుల చదువులకు ఇబ్బందులు ఎదురవుతున్నా యని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో ఉపాధ్యాయుడిని నియమించాలని సర్పంచ్ రోజాతో పాటు గ్రామస్తులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.ఒక్క ఉపాధ్యాయుడే అన్ని తరగతుల విద్యార్థులకు బోధించాల్సి రావడంతో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం కష్టంగా మారుతోందని వారు పేర్కొంటున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే పాఠశాలకు అదనపు ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరుతున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి వెంటనే మరో ఉపాధ్యాయుడిని నియమించి విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రోజా, గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీరు,విద్యుత్ వృథాను అరికట్టాలి

రామకృష్ణాపూర్,అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి):ఎల్‌నినో ప్రభావంతో నీటి, విద్యుత్ కొరత ఏర్పడే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ కోరారు. నీటి వృథాను అరికట్టి, లీకేజీలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరం లేనప్పుడు విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయాలని, నీరు,విద్యుత్ పొదుపులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

గోదావరిలో తగ్గిన నీటిమట్టం.. బయటపడిన ఇసుక తిన్నెలు

వర్షపాతం తగ్గడమే కారణమా?

సాగునీటి ఇబ్బందులపై రైతుల్లో ఆందోళన

చెన్నూరు నియోజకవర్గం, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి): చెన్నూరు ప్రాంతంలోని గోదావరి నదిలో నీటిమట్టం గణనీయంగా తగ్గడంతో ఇసుక తిన్నెలు బయటపడుతున్నాయి. ఒకప్పుడు ఉధృతంగా ప్రవహించిన గోదావరి నది ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గి వెలవెలబోతోంది. వర్షపాతం తగ్గడం, ఎల్‌నినో ప్రభావం వంటి కారణాలు నదిలో నీటిమట్టం తగ్గడానికి కారణమై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.నదిలో నీటి మట్టం తగ్గుతుండటంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యవసాయానికి అవసరమైన సాగునీటి లభ్యతపై ప్రభావం పడుతుందని రైతులు భయపడుతున్నారు. నీటిమట్టం మరింత తగ్గితే పంటలకు నీరందించడం కష్టమవుతుం దని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గోదావరి నదిలో నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో సాగునీటి అవసరాలు ఎలా తీరుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు నదిలో నీటిమట్టం పరిస్థితిని పరిశీలించి, సాగునీటి అవసరాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

68వ రోజుకు చేరిన భూమాచారి దీక్ష మద్దతు తెలిపిన ట్రాక్టర్ అసోసియేషన్

జన్నారం,అక్టోబర్25(ప్రజాజ్యోతి) కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేసి ఏకోసెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జన్నారంలో సామాజిక కార్యకర్త భూమాచారి చేస్తున్న నిరవధిక దీక్ష గురువారం నాటికి 68వ రోజుకు చేరింది. ఆయన చేపట్టిన దీక్షకు ట్రాక్టర్ అసోసియేషన్ మద్దతు తెలుపుతూ ఆయనతోపాటు దీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైగర్ జోన్ కారణంగా ఆదివాసీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అటవీ చట్టాల పేరుతో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోందని, పోడు భూములు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు అనుమతులు రావడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే టైగర్ జోన్ ను రద్దు చేసి గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు..68వ రోజు దీక్షకు మద్దతుగా ట్రాక్టర్ అసోసియేషన్ నాయకులు బొంతల చంద్రమౌళి, అనుముల శ్రీనివాస్, కొత్త తిరుపతి, కాశెట్టి శ్రీనివాస్, కటకం సతీష్, రాథోడ్ తుకారాం తదితరులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైగర్ జోన్ రద్దు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని,68 రోజులుగా సానుకూల పోరాటం చేస్తున్నా ప్రభుత్వం నుండి ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ప్రత్యక్ష పోరాటానికి రూపకల్పన చేయాలని, ఎంతవరకు సాగినా వదలకుండా టైగర్ జోన్ రద్దుచేసి ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేసే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుంది అన్నారు.

జాతీయ రహదారుల వెంట పోలీసుల ఆకస్మిక తనిఖీలు

టీ స్టాల్స్, పాన్ షాపులు, దాబాల్లో విస్తృతంగా తనిఖీలు

ఆసిఫాబాద్, అక్టోబర్ 29 ప్రజా జ్యోతి జాతీయ రహదారుల వెంట ఉన్న టీ స్టాల్స్, పాన్ షాపులు, దాబాలు, ఇతర వ్యాపార కేంద్రాల్లో పోలీసులు గురువారం ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి. అశోక్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్న కార్యకలాపాలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, సంబంధిత శాఖల అనుమతుల వివరాలను పరిశీలించారు. అనుమతులు లేకుండా పర్మిట్ రూములు నిర్వహించడం, అక్రమంగా మద్యం నిల్వ చేయడం, విక్రయించడం, మద్యం సేవించేందుకు అనధికారికంగా ఏర్పాట్లు చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. దాబాలు, టీ స్టాల్స్‌ను కేంద్రంగా చేసుకుని జూదం, పేకాట, సట్కా మట్కా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత వహించాలని సూచించారు.జాతీయ రహదారుల వెంట అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, అలాంటి చర్యలను ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు.వ్యాపార నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు, సంబంధిత శాఖల అనుమతులను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సహకరించినా బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు.ఈ తనిఖీల్లో ఆసిఫాబాద్ సీఐ నీలం రవి, రెబ్బెన సీఐ సంజయ్ కుమార్, రెబ్బెన ఎస్ఐ వెంకట కృష్ణ, వాంకిడి ఎస్ఐ మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం, సైబర్ నేరాలపై అవగాహన

ఈ నెల 31న రక్తదాన శిబిరం

కెరమెరి, అక్టోబర్ 29 ప్రజా జ్యోతి కెరమెరి గ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాబృందం సభ్యులు గురువారం ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రక్తదానం ఆవశ్యకత, ఈ నెల 31న నిర్వహించనున్న రక్తదాన శిబిరం, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాలపై వివరించారు.రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.అలాగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింక్‌లను తెరవవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు నేరాల నివారణపై అవగాహన కల్పించడమే కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు.

పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలి

నిర్మల్ జిల్లా అధ్యక్షులు లోకిని రాము పిలుపు

ఖానాపూర్ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో జరగనున్న పాంచజన్య సంకల్ప సభను విజయ వంతం చేయాలని నిర్మల్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు లోకిని రాము పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్ ముధోల్,నియోజకవర్గం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత పాంచ జన్య సంకల్ప సభ విజయవంత నికి పాటు పడాలని కోరారు ఇంద్రవెల్లిలో అమరవీరుల స్పూర్తి పాంచజన్య పూరించనున్నారని సమావేశాలు పార్టీ అభివృద్ధి కోసం చేసుకోవాలని రాము అన్నారు

గ్రామాల్లో ఎలినోవా ప్రభావాన్ని వివరించిన ఎంపీడీవో రాథోడ్ రాధా

ఇంటింటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలి

ఖానాపూర్ అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి) ఎనీలోవ ప్రభావాన్ని దానివల్ల కలిగే నష్టాన్ని ఖానాపూర్ మండలంలోని సింగాపూర్ పంచాయతీ ఆదివాసి గోండగూడ లో ఇంటింటికి తిరిగి ఎంపీడీవో రాథోడ్ రాదా వివరించారు ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు అనంతరం గ్రామస్తులు ఏకమై ఇంటింటికి ఇంకుడు గుంతలు కట్టుకోవడానికి సిద్ధమయ్యారు. దీంతో ఇంకుడు గుంత నిర్మా నాని ఎంపీడీవో రాధా ఆధ్వర్యంలో ప్రారంభించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ లతా శంకర్, ఉప సర్పంచ్ అర్జున్ సుజాత వార్డు మెంబర్, కవిత ఏపీవో, లావణ్య పంచాయతీ కార్యదర్శి, రవి ఫీల్డ్ అసిస్టెంట్ మాధవ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ గా జి సుధాకర్ నియామకం

మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 29 ప్రజా జ్యోతి మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ గా ఎండీ రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్ నియమితులయ్యారు.ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. నూతన బాధ్యతల్లో ఆసుపత్రి పరిపాలన, వైద్య సేవల సమన్వయం, రోగులకు మెరుగైన వైద్య సదుపాయాల కల్పనలో ఆయన కీలకంగా వ్యవహరించనున్నారు.ఆయన నియామకంపై వైద్య వర్గాలు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ గుర్తింపు సంఘంగా ఎంప్లాయీస్ యూనియన్ ఘన విజయం

కార్మిక హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడుతాం.. ఈదురు వెంకన్న

మంచిర్యాల, 29,అక్టోబర్ (ప్రజాజ్యోతి): పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నిర్వహించిన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల్లో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్‌ను రాష్ట్ర గుర్తింపు సంఘంగా గెలిపించిన కార్మికులకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ సాధించిన విజయాన్ని పురస్కరించుకొని గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణాసంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ వరకు కొనసాగింది. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో యూనియన్ నాయకులు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈదురు వెంకన్న మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్మిక చట్టాలకు విరుద్ధంగా ఉన్న విధులను సరిచేయడం, ఉద్యోగ భద్రత సాధించడం, కార్మికులకు మెరుగైన పని పరిస్థితులు కల్పించడం, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ఇప్పించడం తమ ప్రధాన

లక్ష్యాలని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యంపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం చేసి హక్కులను కాపాడుతామని తెలిపారు. ఎన్నికల్లో యూనియన్‌కు మద్దతుగా నిలిచిన ప్రతి కార్మికుడికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల ఐక్యత, పోరాట పటిమకు ఈ విజయం నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను గుర్తింపు సంఘం హోదాలో ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాల సాధనకు సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌తో పాటు మేకలదాసు, కలిందర్ అలీఖాన్, వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, గోలి శంకర్, మామిడిపల్లి శ్రీనివాస్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో చల్లబడిన వాతావరణం రాత్రివేళ పెరుగుతున్న చలి!

మబ్బులతో పాటు అక్కడక్కడ వర్షాలు..

దగ్గు, జలుబు, జ్వరాలతో ప్రజల ఇబ్బందులు

మంచిర్యాల, 29,అక్టోబర్ (ప్రజాజ్యోతి): మంచిర్యాల జిల్లాలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. గత కొన్ని రోజులుగా కొనసాగిన వేడి వాతావరణం బుధవారం సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టడంతో చల్లటి గాలులు వీస్తున్నాయి. రాత్రి సమయంలో సాధారణ వర్షం కురవడంతో వాతావరణం మరింత చల్లబడింది. గురువారం ఉదయం నుంచి ఆకాశం మబ్బులతో కమ్ముకుని ఉండగా, జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ ఒక మోస్తరు వర్షం, మరికొన్ని చోట్ల చిరుజల్లులు కురిశాయి. దీంతో పగటిపూట వేడి నుంచి ఉపశమనం లభిస్తున్నప్పటికీ, రాత్రివేళ చలి పెరుగుతుండటంతో పట్టణ ప్రజలు కొంత ఇబ్బందులకు గురవుతున్నారు.

నవంబర్ 2 నుంచి మళ్లీ వర్షాలు కురిసే అవకాశం!

తెలంగాణలో ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పడుతున్నప్పటికీ, బంగాళాఖాతంలో మరో తుఫాను ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అక్టోబర్ 29నాటి వాతావరణ సూచనల ప్రకారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గురువారం మధ్యాహ్నం వరకు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆ తర్వాత వర్షాలు తగ్గి పొడి వాతావరణం నెలకొనే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ అక్కడక్కడ చెదురుమదురు జల్లులు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. నవంబర్ 2 నుంచి రాష్ట్రంలో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న అంచనాలతో వాతావరణ పరిస్థితులపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. అయితే తుఫాను ప్రభావం, వర్షాల తీవ్రతపై అధికారిక వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనించాల్సి ఉంది.

దగ్గు, జలుబు, జ్వరాలతో ఇబ్బందులు

మరోవైపు, గత వారం రోజులుగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో పట్టణంలోని అనేక కుటుంబాల్లో పెద్దల నుంచి చిన్నపిల్లల వరకు దగ్గు, జలుబు, జ్వరాల వంటి లక్షణాలతో బాధపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంట్లో ఒకరికి అనారోగ్య లక్షణాలు కనిపించిన తర్వాత ఇతర కుటుంబ సభ్యులకూ ఇలాంటి లక్షణాలు వస్తుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. వైరల్ ఇన్‌ఫెక్షన్ల కారణంగా కొందరిలో జలుబు, దగ్గు ఎక్కువ రోజులు కొనసాగుతూ ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ లక్షణాలతో పలువురు వైద్యులను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. వాతావరణ మార్పుల సమయంలో చిన్నపిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. దగ్గు, జలుబు, జ్వరాలు ఎక్కువ రోజులు కొనసాగినా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురైనా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. చేతులను శుభ్రంగా ఉంచుకోవడం, దగ్గు లేదా తుమ్ము వచ్చినప్పుడు నోరు, ముక్కును కప్పుకోవడం, అనారోగ్యంతో ఉన్నవారికి అవసరమైన దూరం పాటించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణం చల్లబడుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

అనుమానాస్పద పరిస్థితుల్లో దళిత యువకుడి మృతి

సమగ్ర విచారణ జరపాలి ఎమ్మెల్యే పాయల్ శంకర్

మూడు రోజుల్లో నిష్పక్ష పాత విచారణ పూర్తి చేయాలి

బాధిత కుటుంబానికి ప్రభు త్వ ఉద్యోగం, రూ.50 లక్షల పరిహారం అందించాలి

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ రిమ్స్ లో చికిత్స కోసం చేరిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. యువకుడు రాసినట్లు చెబుతున్న సూసైడ్ నోట్‌లో వైద్యుల నిర్లక్ష్యం, పోలీసుల వేధింపుల గురించి ప్రస్తావించిన నేప థ్యంలో, ఈ అంశాలన్నింటి పై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బుదవారం రాత్రి తేలు కుట్టడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు వచ్చిన యువకుడు, అనంతరం ఆత్మహ త్యకు పాల్పడిన ఘటన అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చికిత్స అందించిన విధానం, వైద్యుల బాధ్యతలు, పోలీసుల వ్యవహారశైలి, సూసైడ్ నోట్‌లో పేర్కొన్న అంశాలపై ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ జరగాలని అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని మూడు రోజుల్లోగా నిష్పక్షపాత విచారణ పూర్తి చేసి, సమగ్ర నివేదిక ను సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. విచారణ నివేదికను ఆదిలాబాద్‌లోని అన్ని దళిత సంఘాలకు అందజేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్నందున, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఎమ్మెల్యే కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు రూ.50 లక్షల ఆర్థిక పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు వైద్యం అందించాల్సిన వైద్య వ్యవస్థలోనూ, రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలోనూ బాధ్యతాయుతమైన వ్యవహారశైలి ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. విచారణలో ఎవరి నిర్లక్ష్యం లేదా తప్పిదం బయటపడినా, చట్టప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొమురం భీమ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఘన నివాళులు

ఇంద్రవెల్లిలో పూజలు నిర్వ హించి పూలమాలలు వేసిన అధికారులు, ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన వీర యోధుడు కొమురం భీమ్‌కు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఘనంగా నివాళులర్పించారు. గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ పీవో మందమక రందు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తో కలిసి కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ ఆశయాలు, ఆదివాసీల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఆదివాసీ సమాజ అభ్యున్నతి, గిరిజనుల హక్కుల పరిరక్షణలో కొమురం భీమ్ పోరాట స్ఫూర్తి ఎప్పటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో మహేందర్, ఎం పీవో సంజీవ్ రావు, కొమురం భీమ్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మెస్రం నాగ్‌నాథ్, కేస్లాపూర్ రాయిసెంటర్ సార్‌మెడి మెస్రం వెంకటరా వు పటేల్, గిన్నేరా రాయి సెంటర్ సార్‌మెడి మెస్రందు ర్గ, ఇంద్రవెల్లి సర్పంచ్ రాథో డ్ మోహన్ సింగ్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, ఆదివాసీ నాయకులు పూర్కా చిత్రు, కనక తుకారామ్, జు గాదిరావు, గేడం భరత్,సుం కట్ రావు, పలువురు ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ నా యకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా గులాబీ మయం కాబోతుంది

బోథ్ ఎమ్మెల్యేఅనిల్ జాదవ్

కెటిఆర్ రైతు గర్జన సభ ఏ ర్పాట్లకు శంకుస్థాపన

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి) రాష్ట్రంలో రైతులు ఇబ్బందు లతో చేసుకుంటున్న ఆత్మ హత్యలను ఆపాలని రైతులకు భరోసా కల్పించడానికి ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుండి మొట్ట మొదటగా నవంబర్ 1వ తేదీన నిర్వ హిస్తున్న రైతు గర్జన సభ ఏర్పాట్లకు గురువారం మా జీ మంత్రి జోగు రామన్న, మాజీ విప్ బాల్క సుమన్, యువ నాయకులు భార్గవ దేశ్ పాండే లతో కలిసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా కేటీఆర్ రైతు గర్జన సభకు హాజరవుతామని తెలుపుతున్నారని అన్నారు. నవంబర్ 1వ తేదీన ఆదిలాబాద్ జిల్లా గులాబీ మయం కాబో తున్నదని ఇప్పటికే తెలిసి పోతుందన్నారు. కేసీఆర్ కి ప్రజలు బ్రహ్మరథం పెట్టె రోజులు దగ్గర్ లోనే ఉన్నాయ న్నారు. బోథ్ నియోజకవర్గం నుండి భారీ ఎత్తున కేటీఆర్ సభకు రాబోతున్నామని తె లిపారు.

కంబ్లె రాహుల్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండ గా ఉంటాం

మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి) ఎంబిఎ విద్యార్థి కాంబ్లె రాహుల్ మరణం బాధాకరమని ఆయన మృతికి కారకులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఉద్యోగంతో పాటు రాతపూర్వక ఒప్పందం ద్వారా నష్ట పరిహారం అందించిన్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రిమ్స్ ఆస్పత్రి ఎదుట కాలనీ వాసులు, వివిధ సంఘాల నాయకులు కంబ్లె రాహుల్ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ, టూ టౌన్ పోలీసుల తీరును నిర సిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ జిల్లా పరిషత్ చై ర్మన్ రాథోడ్ జనార్దన్ అక్క డికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు సంఘీ భావం తెలిపారు. సంఘాల నాయకులతో కలిసి వారికి మద్దతుగా నిలిచి, కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రిమ్స్‌లో జాయింట్ కలె క్టర్‌తో పాటు ఆస్పత్రి డైరెక్టర్ ను కలిసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కో రారు. వైద్యుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపిబాధ్యు లపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన జోగు రామన్న, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు ప్రభుత్వం తక్షణమే స్పందించి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో కుటుంబసభ్యులు, సంఘాల నా యకులు చేపట్టే తదుపరి కార్యాచరణకు తమ పూర్తి సంఘీభావం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇజ్జగిరి నారాయణ, సాజి తోద్దీన్, అన్నెల వసంత్, చందాల రాజన్న, దమ్మాపాల్, కొండ గణేష్, బట్టు సతీష్, దివిటి రాజు, బుట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

పక్షం రోజులుగా తమను విధులలో తీసుకోవడం లేదని నిరసిస్తూ ఆందోళన చెందుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిశుభ్ర కార్మికులు

ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పని చేయాలని సర్పంచ్ ఆదేశాలు,ఏ పంచాయితీలో లేని ఆదేశాలు జారీ చేస్తూ ఇబ్బంది పెట్టడం అత్యంత దారుణం

తమ సమస్యలను మండల అధికారులకు విన్నవించిన స్పందన లేక పట్టించుకోవడం లేదని కన్నీళ్ళ పర్యంత మైన పంచాయతీ పరిశుభ్ర కార్మికులు:

జిల్లా కలెక్టర్,డిస్టిక్ పంచాయతీ అధికారి, డిఎల్పిఓ వెంటనే స్పందించి తమను విధు లో సుకోవాలని విజ్ఞప్తి:

సిర్పూర్(టి) ఎంపీడీఓ ప్రసాద్ కు మరోసారి విజ్ఞప్తి చేసిన పంచాయతీ కార్మికులు, సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ:

సెప్టెంబర్29,సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా 001 మొట్టమొదటి నియోజకవర్గ హెడ్ క్వార్టర్ సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయితీ పరిశుభ్ర కార్మికులు తమను పక్షం రోజులుగా విధుల్లో లేకపోవడం లేదని నిరసన తెలియజేస్తూ ఆందోళనాల చెందుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామపంచాయతీ పరిశుభ్రత కార్మికులు ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పని చేయాలని గ్రామ సర్పంచ్ ఆదేశాలు జారీ చేశారని ఆవేదన ఏ పంచాయతీలో లేని ఆదేశాలు జారీ చేసి ఇబ్బంది పెట్టడం అత్యంత దారుణమని పంచాయతీ పరిశుభ్రత కార్మికులు అన్నారు. తమ సమస్యలను మండల అధికారులను విన్నవించిన స్పందన కరువైందని, పట్టించు కోవడంలేదని కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. జిల్లా పాలనాధికారి, జిల్లా పంచాయతీ అధికారి,డివిజన్ లేవల్ పంచాయతీ అధికారి వెంటనే స్పందించి తమను విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఈరోజు సిర్పూర్(టి) ఎంపీడీఓ కోట ప్రసాద్ ను మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కలిసి తమ సమస్యలను విన్న పించారు.స్థానికూలంగా స్పందించిన ఎంపీడీఓ ప్రసాద్ త్వరలోనే సమస్యను పరిష్కరించి విధులు తీసుకునే ప్రయత్నం చేస్తానని సహై కార్మికులకు హామీ ఇచ్చారు.

ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా పడి ఉన్న చెత్త చెదారం నిండిపోయిన డ్రైనేజీరు

సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ పరిశుభ్రత కార్మికులు విధులో లేకపోవడం వల్ల వివిధ కాలనీలతో పాటు బస్టాండ్ మెయిన్ రోడ్డు పై ఎక్కడ చూసినా చెత్తచెదారం కుప్పలు కుప్పలుగా పడి ఉండడం, డ్రైనేజీలు ఎక్కడికక్కడే నిండి పోవడంతో దుర్వాసన వ్యాపిస్తుండడం తో ఇబ్బంది పడుతున్న ప్రజలు పెరిగిపోయిన చెత్తను,డ్రైనేజీలను శుభ్ర పరచాలని కోరుతున్నారు.

సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీ పరిశుభ్ర కార్మికులు మాట్లాడుతూ ...

గత 20 ఏళ్ల నుండి వర్షాలకు తడుస్తూ విపరీతమైన చలి గాల్పులకు వణుకుతూ తీవ్రమైన ఎండలను తట్టుకొని ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విధులు నిర్వహించే వాళ్ళమని ప్రస్తుతం తమను సర్పంచ్ ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలని లేకుంటే విధులకు రావద్దని ఆదేశాలు జారీ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ పంచాయతీలో లేని ఆదేశాలు జారీ చేస్తూ తమరిని వీధిలోకి తీసుకోక పోవడం విడ్డూరమని అన్నారు. గత 20 సంవత్సరాల నుండి లేని ఆదేశాలు జారీ చేస్తూ ఇబ్బంది పెట్టడం అత్యంత దారుణం అన్నారు.గత సంవత్సరాల మాదిరి గానే ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిజాయితీతో పని చేస్తూ ప్రజలకు సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని పంచాయతీ కార్మికులు అన్నారు. జిల్లా పాలనధికారి జిల్లా పంచాయతీ అధికారి, డివిజన్ లెవెల్ పంచాయతీ అధికారి వెంటనే స్పందించి తమను వీధిలోకి తీసుకోవాలని గ్రామపంచాయతీ పరిశుభ్రత కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీజేపీ సవాల్‌ను స్వీకరిస్తున్నాం

నవంబర్ 9 తర్వాత ఓట్ల వివరాలు వెల్లడిస్తాం - జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రఘునాథ్.

ఢిల్లీ ధర్నాకు మంచిర్యాల జిల్లా నుంచి 500 మంది తరలింపు.

మందమర్రి ,అక్టోబర్ 29(ప్రజాజ్యోతి):మంచిర్యాల జిల్లాలో బీజేపీ నాయకులు చేస్తున్న సవాళ్లను స్వీకరిస్తున్నామని, నవంబర్ 9 తర్వాత ఓట్లకు సంబంధించిన వివరాలను ప్రజల ముందు ఉంచుతా మని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రఘునాథ్ స్పష్టం చేశారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘం స్వతంత్రతను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు మంచిర్యాల జిల్లా నుంచి సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్తున్నట్లు వెల్లడించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా లోని పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య కార్యకర్తలతో కలిసి ఢిల్లీ ధర్నాకు హాజరుకానున్నట్లు రఘునాథ్ తెలిపారు. చెన్నూరు ఎమ్మెల్యే, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌ల సమన్వయంతో కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఎన్నికల సంఘం నియామక కమిటీలో ప్రతిపక్ష నేత స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చడం దురదృష్టకరమని రఘునాథ్ అన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాల్సి ఉండగా, అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని, సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ నాయకత్వంపై బీజేపీ నాయకులు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాకా వెంకటస్వామి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. తాగునీటి సదుపాయాల కల్పనతో పాటు సింగరేణి సంస్థ సంక్షోభంలో ఉన్న సమయంలో కార్మికుల ఉద్యోగాలను కాపాడేందుకు ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. గడ్డం వివేక్ వెంకటస్వామి మూతపడిన ఎరువుల కర్మాగారాన్ని పునఃప్రారంభింపజేసి ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేశారని తెలిపారు.పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని రఘునాథ్ చెప్పారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పింఛన్ల పెంపు కోసం పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో పాటు బొగ్గు ఉత్పత్తి, సరఫరా పెంపునకు రూ.3,600 కోట్ల నిధులు సాధించేందుకు కృషి చేశారని వివరించారు. రామగిరి ఖిల్లా ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించారని తెలిపారు.ఎన్నికల సమయంలో ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు ఇస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ వాటిని అమలు చేయడంలో విఫలమైందని రఘునాథ్ విమర్శించారు. తెలంగాణలో 18 మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ

ఉత్తర తెలంగాణకు ఉపయోగపడే ప్రధాన ప్రాజెక్టులను తీసుకురావడంలో వారు సాధించిన ప్రగతి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. జాతీయ రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి పలుమార్లు వినతులు సమర్పించినట్లు తెలిపారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద నిర్మించి ఉంటే ఎల్లంపల్లి ద్వారా సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉండేదని రఘునాథ్ అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో జరిగిన తప్పిదాలపై విచారణ జరగాలని పేర్కొన్నారు.140 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని, దేశ అభివృద్ధికి కృషి చేసిందని రఘునాథ్ అన్నారు. అభివృద్ధి అంశాలపై చర్చించకుండా మతపరమైన అంశాలతో ఓట్లు కోరడం బీజేపీకి అలవాటుగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీపై చేసే విమర్శలకు ప్రజల మధ్యే సమాధానం చెబుతామని స్పష్టం చేశారు.

క్రిటికల్ కేర్ బ్లాక్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి!

వైద్య పరికరాలు, సిబ్బందిని సమకూర్చి పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

నిర్మల్ టౌన్, అక్టోబర్ 29 : (ప్రజాజ్యోతి) నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ భవనంలో అవసరమైన వైద్య పరికరాలు, వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని సమకూర్చి అత్యవసర వైద్య సేవలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 2023 జూన్‌లో ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన జరిగినట్లు అప్పటి వార్తా కథనాలు పేర్కొన్నాయి సుమారు రూ. 23.75 కోట్ల అంచనా వ్యయంతో 50 పడకల సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని నిర్మించినట్లు వార్తల్లో వెల్లడైంది. అయితే, 2026 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ప్రచురితమైన పలు వార్తా కథనాల్లో కేంద్రం ప్రారంభం, వైద్య పరికరాల ఏర్పాటు, సిబ్బంది నియామకంపై ప్రశ్నలు లేవనెత్తారు.

అత్యవసర రోగులకు ఎంతో ఉపయోగం

ఈ క్రిటికల్ కేర్ బ్లాక్ పూర్తిస్థాయిలో పనిచేస్తే ప్రమాదాల్లో గాయపడినవారు, గుండె సంబంధిత సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, ఇతర ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం

తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న కొందరు రోగులను మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. స్థానికంగా అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉంటే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

పరికరాలు, సిబ్బందిపై స్పష్టత ఇవ్వాలి

క్రిటికల్ కేర్ బ్లాక్‌లో అవసరమైన వెంటిలేటర్లు, మానిటర్లు, ఇతర అత్యవసర వైద్య పరికరాల ఏర్పాటు ఎంతవరకు పూర్తయింది? వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది నియామకాలు పూర్తయ్యాయా? ప్రస్తుతం ఎన్ని పడకలు అందుబాటులో ఉన్నాయి? కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఎప్పటి నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తారు? అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత

ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి

నిర్మల్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌ను నిరుపయోగంగా ఉంచకుండా అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, పనుల పురోగతి, పరికరాల ఏర్పాటు, సిబ్బంది నియామకాలు, ప్రారంభ తేదీపై స్పష్టమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజాధనం వెచ్చించి నిర్మించిన వైద్య భవనం ప్రజల ప్రాణాలను కాపాడే కేంద్రంగా మారినప్పుడే దాని లక్ష్యం నెరవేరుతుంది.

కాగజ్ నగర్ తహసిల్దార్ కార్యాలయంలో. ఏసీబీ దాడులు,రూ. 22 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన జిపిఓ శ్రీనివాస్

భూమి విరాసత్ కోసం రూ"50,000 డిమాండ్ చేసి రూ .22 వేలు,తీసుకుంటుండగా రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నాం.వివరాలు వెల్లడించిన ఏసీబీ డిఎస్పి మధు

అధికారులు పనుల కోసం లంచం అడిగినట్లయితే 1064 లేదా డిఎస్పి ఏసిబి మొబైల్ నెంబర్: 9154388963 పై నేరుగా తెలియజేయాలి

ప్రజలకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా సూచించిన ఏసిబి డిఎస్పి మధు:

అక్టోబర్29,సిర్పూర్-టి నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:------కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజక వర్గంలోని సిర్పూర్ కాగజ్నగర్ మండలం తాహసిల్దార్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారుల అకస్మిక దాడులు,ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు వాలపన్ని దాడులు నిర్వహించగా రూ. 22 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా జిపిఓ శ్రీనివాస్ ను రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నా మని తెలిపిన ఏసిబి అధికారులు (అవినీతి నిరోధక శాఖ) అధికారుల అకస్మిక దాడులో లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా సంబంధిత ప్రభుత్వ ఉద్యోగి ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డిఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయం లో జిపిఓ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ అనే ఉద్యోగి,విధి నిర్వహణలో ఒక బాధితుడి నుంచి రూ. 50వేల లంచం డిమాండ్ చేసి రూపాలు 22 వేలను కుదించుకొని లంచం తీసుకుంటుండ గా రెడ్ హ్యాంగ్ గా పట్టు పట్టుబడినట్లు ఏసీబీ డీఎస్పీ మధు తెలిపారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పక్కా పథకం ప్రకారం గురువారం దాడులు నిర్వహించామని అన్నారు. అనంతరం

కార్యాలయంలోని రికార్డులను,నిందితుడి వద్ద ఉన్న ఆధారాలను సుమారు గంటకు పైగా క్షుణ్ణంగా పరిశీలించినట్లుతెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు, త్వరలోనే ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ మధు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే వెంటనే1064 లేదా డిఎస్పి ఏసీబీ చరవాణి నెంబర్: 9154388963 పై ఏసీబీ అధికారులను సంప్రదించాలని డిఎస్పీ మధు ఈ సందర్భంగా. ప్రజలకు సూచించారు.

రెడ్ క్రాస్ సేవలు మరింత విస్తృత పరచాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి) జిల్లాలో ఇండియన్ రెడ్ క్రా స్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేసేందుకు చర్య లు తీసుకుంటామని, సంస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఐ ఆర్‌సిఎస్ ప్రతినిధులతో ఆ యన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ కార్యకలాపాలకు ఊతమిచ్చేలా పలు అంశాలపై కలెక్టర్ సూచ నలు చేస్తూ సంస్థ ద్వారా ప్రజలకు వైద్య సేవలు, రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిరంతరం అందేలా చూడాలన్నారు. నూతన బ్లడ్ బ్యాంక్ మంజూరు, సంస్థ నిర్వహణ పారదర్శక తపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనం తరం కైలాస్‌నగర్ వైట్ క్వార్టర్స్‌లో శిథిలావస్థకు చేరిన రెడ్ క్రాస్ భవనానికి తాత్కా లిక మరమ్మతులు లేదా నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వ కేటాయించిన స్థలంలో వసతులు కల్పించడంపై చర్చించారు. అనంతరం సభ్యులకు రెడ్ క్రాస్ గుర్తింపు కార్డులను కలెక్టర్ అం దజేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, ఐ ఆర్ సీ ఎస్ చైర్మన్ క్రాంతి కుమార్, వైస్ చైర్మన్ మనోహర్ రా వు, స్టేట్ కమిటీ మెంబర్ ఎ న్. రాజేశ్వర్ రావు, రిమ్స్ డై రెక్టర్ జైసింగ్ రాథోడ్, సభ్యులు పార్థసారథి, రూపేష్ రెడ్డి, అనిల్, సంజయ్, విశ్వనాథ్, కృష్ణ, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ. 20 లక్షలతో వీవో భవ ణాల నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) ఇచ్చోడ మండలంలోని సా త్ నంబర్, ఇస్లాంనగర్ గ్రామాల్లో రూ. 20 లక్షల వ్య యంతో చేపట్టనున్న వీవో భవనాల నిర్మాణ పనులకు గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ప్రాధాన్యతని చ్చిందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయడం అవస రమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వీవో భవణాల నిర్మాణం పూర్తయితే గ్రామాల్లోని మహిళా సంఘాలకు సమావేశాలు నిర్వహించుకో వడానికి, వారి కార్యకలాపాలను సమర్థ వంతంగా కొనసాగించ డానికి సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పీ ప్రీతం రెడ్డి, సర్పంచ్ రాథోడ్ రమేష్, ఉప సర్పంచ్ షబ్బీర్, పిఎసిఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, గాద్దే సుభాష్, మనోహర్, రోహిదాస్, న్యాజ్, విక్రమ్ తో పాటు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరి పంటపై పొలం బడి

లక్ష్మణ చాంద, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి) పొట్టపల్లి(కే) గ్రామం లో వరిపంట పై పొలం బడి అనే కార్యక్రమాన్ని ఆత్మా వారి సౌజన్యంతో పోట్టపల్లి గ్రామంలో గురువారం రోజున నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నిర్మల్ సహాయ వ్యవసాయ సంచాలకులు డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతు వరి పంట సాగు పైనా పూర్తి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో రైతులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు అనవసర ఖర్చులు తగ్గించి పంటకి అయ్యే పెట్టుబడి, వ్యయాన్ని తగ్గించి, వాతావరణ సమతుల్యతను కాపాడి అధిక దిగుబడులు పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి నాగరాజు మాట్లాడుతూ, ఈ పొలం బడి కార్యక్రమం ద్వార రైతులు సాగు చేసే పద్ధతికి, శాస్త్రవేత్త లు సూచించిన సిఫరసుకి మధ్య ఉన్నా తేడా ను ఈ పొలం బడి కార్యక్రమం ద్వారా రైతులకు డైరెక్ట్ గా మిత్ర పురుగులు శత్రువు పురుగులు, చీడపీడలు పోషకాల లోపాలు గుర్తించే విధానం నేరుగా రైతులకి తెలియజేసారు. పురుగు మరియు తెగుళ్ల మందులు పిచికారీ చేసేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు,

చీ95 మాస్క్, చేతి గ్లౌజ్, కళ్ళ జోడు ప్యాంట్ షర్ట్ ను, ఒక రైతుకి నేరుగ వేసి డెమో చూయించడం జరిగింది. అలాగే సమగ్ర యజమాన్య పద్ధతుల పై లింగాకర్షణ బుట్టలు పసుపు, నీలి రంగు అట్ట ముక్కలుపై, మరియు అధిక ఎరువుల వినియోగం - నష్టాల పై అవగాహన కపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొట్టపల్లి గ్రామ సర్పంచ్ ముఖేష్ , ఉపసర్పంచ్ రవీందర్ ఏఈవో కె మౌనిక, వి పవిత్ర, జి సుష్మిత మహేష్ ప్రశాంత్, 50 మంది గ్రామ రైతులు పాల్గొన్నారు.

అమృత్ పథకం ద్వారా నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేకచర్యలు

ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా అమృ త్ పథకం ద్వారా పలు అభి వృద్ధి పనులు చేపడుతున్న ట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. ఆదిలాబాద్ లోని డైట్ కళాశాల వద్ద అమృత్ పథకంలో భాగంగా చేపడుతున్న ఇంకుడు గుంత నిర్మాణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మున్సిపాలి టీలోని 10 వార్డుల్లో రూ.50 లక్షల వ్యయంతో 10 ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెం పొందించడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చ ని పేర్కొన్నారు. అదేవిధంగా చెరువులు కలుషితం కాకుండా నివారించేం దుకు, మురుగునీటిని శుద్ధి చేసే వ్యవస్థల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నీటి సరఫరాలో కొరత ఏర్పడ కుండా అమృత్ పథకం కింద ఓవర్ హెడ్ స్వస్ రిజర్వాయర్ల (ఓ ఎచ్ ఎస్ ఆర్) నిర్మాణ పనులు కూడా కొనసాగుతు న్నాయని వివరించారు. ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ పనులను అధికారులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడు వులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. పనుల పురో గతిపై ప్రత్యేక దృష్టి సారిం చి, ప్రజలకు మెరుగైన తాగు నీటి సౌకర్యాలు కల్పించాల ని అధికారులను కోరారు.

పారదర్శకంగా అంగన్వాడీ టీచర్ నియామక ఇంట ర్వ్యూలు

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి) అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్ల నియమానికి సంబంధించిన ఇంటర్వ్యూ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ఉట్నూర్ మండలంలో ఖాళీగా ఉన్న వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్ నియమానికి దరఖాస్తు చేసుకున్న మహిళ అభ్య ర్థులకు గురువారం కేబీ కాంప్లెక్స్ పిఎంఆర్సి సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో మంద మకరందు తో కలిసి ఆయన ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మ హిళా, శిశు సంక్షేమానికి అం గన్వాడీ కేంద్రాల పాత్ర కీల కమని, వాటిని బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్ర భుత్వం టీచర్, హెల్పర్ నియామకాలను చేపట్టింద న్నారు. అర్హులైన ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నియామక ప్రక్రియను పక డ్బందీగా చేపట్టామన్నారు. ఉట్నూర్ మండలంలో 27 టీచర్ పోస్టులకు అర్హత సా ధించిన 92 మందిలో 89 మంది అభ్యర్థులు ఇంట ర్వ్యూలకు హాజరుకాగా, ముగ్గురు గైర్హాజరయ్యారని వివరించారు. ఎంపిక ప్రక్రియలో పూర్తిగా మెరిట్, ని బంధనలకే పెద్దపీట వేసినట్లు ఆయన పునరుద్ఘాటిం చారు. ఈ ప్రక్రియలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్‌కు మార్, డిడబ్ల్యుఓ మిల్కాడి. ఎం.ఎచ్.ఓ డా.సాధన, సి డిపిఓలు, అభ్యర్థులు, ఇత ర అధికారులు, సిబ్బంది, త దితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తొర్రూర్ మండల ప్రధాన కార్యదర్శిగా మాహంకాళి దేవేందర్

ఉద్యమకారుడికి సముచిత గుర్తింపు.. పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం

ఇంత గొప్ప అవకాశం కల్పించిన ఝాన్సీ రెడ్డి, యశస్విని రెడ్డి లకు హృదయపూర్వక ధన్యవాదాలు

పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తా: మాహంకాళి. దేవేందర్

తొర్రూర్,
మహబూబాబాద్ జిల్లా :
మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం మాటేడు గ్రామానికి చెందిన మాహంకాళి దేవేందర్‌కు కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించారు. దేవేందర్ ని తొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఉద్యమకారుడికి పార్టీ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడంపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర..

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో మాహంకాళి దేవేందర్ తనదైన శైలిలో నిరసన తెలిపి ఉద్యమ స్ఫూర్తిని చాటుకున్నా రు. తొర్రూర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి సెంటర్ వరకు మోకాళ్లపై నడిచి రాష్ట్ర సాధన పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. అనంతరం మాటేడు గ్రామ మాజీ ఉపసర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ ప్రజల్లో గుర్తింపు పొందారు.

ఝాన్సీ రెడ్డి, యశస్విని రెడ్డిలకు ప్రత్యేక హృదయపూర్వక కృతజ్ఞతలు

తన నియామకంపై మాహంకాళి దేవేందర్ హర్షం వ్యక్తం చేశారు. తొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డికి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.అలాగే తనకు సహకారం అందించిన జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

పార్టీ బలోపేతమే లక్ష్యం

పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని మాహంకాళి దేవేందర్ పేర్కొన్నారు. తొర్రూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ

ముందుకు సాగుతానని తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనుభవం, గ్రామస్థాయిలో పనిచేసిన పరిచయాలతో పార్టీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని దేవేందర్ వెల్లడించారు.

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు?

భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెలల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణనష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా. ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు. ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది. అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

డబల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి)గురువారం మావల, కేఆర్కే కాలనీలోని రెండు పడక గదుల ఇళ్లలో పెండింగ్ పనులను, శానిటేషన్, విద్యుత్, త్రాగునీరు, ఇతర మౌళిక వసతులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ సుభాష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, ఇంజనీరింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలకు బ్యాంకులే నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి

డిజిటల్ మోసాలు పెరుగుతున్న వేళ సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ మోసాల బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని చెప్పింది. ఒకవేళ బ్యాంక్? తగిన శ్రద్ధ వహించడంలో విఫలమవడం వల్లే మోసం జరిగినట్లు రుజువైతే, డిజిటల్ అరెస్టుల వంటి నేరాల బాధితులకు వారు కోల్పోయిన మొత్తాన్నైనా నష్టపరిహారంగా అందించాలని ఆదేశించింది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ కుంభకోణం అంశంపై సుమోటోగా విచారణ జరిపిన సీజేఐ జస్టిస్? సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. డిసెంబర్ 31 నాటికి అమల్లోకి రానున్న ఆర్‌బీఐ కేవైసీ సవరణ ఆదేశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను తెలియజేయాలని ధర్మాసనం ఆర్‌బీఐని కోరింది. మోసపోతున్న వినియోగదారుల అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల విధి అని తెలిపింది. ఖాతాదారుని నిర్ధరిత లావాదేవీల సరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావా దేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్, లావాదేవీల ప్రామాణికతను నిర్ధరించడానికి భౌతిక ధ్రువీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల అవసరాన్ని గుర్తు చేసింది. విచారణ సందర్భంగా కేంద్రం, ఇతర అధికారుల తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50 శాతం తగ్గాయని కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయ చర్యలు, ప్రజా అవగాహన ప్రచారాల వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

'విద్యావంతులు డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారు'

మరోవైపు విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారంటూ సుప్రీం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా చైతన్య కార్యక్రమాలు, వార్తా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా మోసపోతుండటం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మేము ఆశ్చర్యపోతున్న విషయం ఏమిటంటే ప్రజలకు ఇంకా ఎందుకు అర్థం కావడం లేదు? బాధితులకు ఏమైంది? ఈ బాధితులు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? వారికి ఈ ప్రాథమిక విషయం అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మీడియాలో